


https://www.sreechakranews.com

# శ్రీచక్ర

SREECHAKRA TELUGU DAILY




సంపుటి 10 | సంచిక 156 | కర్నూలు | గురువారం జూలై 03 2025

పేజీలు : 08 | వెల రూ. 5.00

Published from Kurnool... Circulated by Andhra Pradesh, Telangana & New delhi

# పంపుసెట్లకు ఉచితంగా సౌర విద్యుత్

**ప్రతి ఇంట్లో సౌర విద్యుత్ ఏర్పాటుకు చర్యలు**
**రాయలసీమ హార్టికల్చర్ హబ్‌గా కుప్పం నియోజకవర్గం**
**స్వర్ణ కుప్పంలో భాగంగా రూ.1292.74 కోట్ల అభివృద్ధి పనులు**
**తుమ్మిశిల ప్రజావేదికలో సిఎం చంద్రబాబు నాయుడు**

చిత్తూరు,జులై 2(ఆర్ఎన్ఎ): రైతుల పంపుసెట్లకు ఉచితంగా సౌర విద్యుత్ అందిస్తామని ఏపీ సీఎం చంద్రబాబు తెలిపారు. శాశ్వతంగా విద్యుత్ ఛార్జీలు చెల్లించే పనిలేకుండా ప్రతి ఇంట్లో సౌర విద్యుత్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామన్నారు. రాయలసీమ హార్టికల్చర్ హబ్‌గా నియోజకవర్గం నిలవబోతోందని చెప్పారు.'అభివృద్ధి, సంక్షేమం రెండూ సమానంగా ఉండాలి. సంపద సృష్టించి సంక్షేమ కార్యక్రమాలు చేపట్టాలి. కుప్పం ప్రజలు తొమ్మిదిసార్లు నన్ను ఎమ్మెల్యేగా ఆశీర్వదించారు. వైకాపా పాలనతో రాష్ట్రంలో విధ్వంసం జరిగింది. అది తలచుకుంటే భయమేస్తోంది. వ్యవస్థలను నాశనం చేశారు.చిత్తూరు జిల్లా కుప్పం నియోజకవర్గంలో రూ.1292.74 కోట్ల విలువైన పలు అభివృద్ధి పనులకు సీఎం శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. అనంతరం తుమ్మిశిలో నిర్వహించిన 'ప్రజావేదిక' సభలో చంద్రబాబు మాట్లాడారు. కుప్పం రూపులేఖలు మార్చబోతున్నామని అన్నారు. గుంతలు లేని రోడ్లు చేస్తామని చెప్పాం.. పూర్తిచేశాం. కుప్పంలో రూ.1292.74కోట్లతో పనులు చేపట్టాం. రూ.3829 కోట్లతో హంద్రీనీవా ద్వారా చివరి ఆయకట్టుకు నీళ్లిస్తాం. 10 లక్షల లీటర్ల పాల ఉత్పత్తి నియోజకవర్గంగా కుప్పం నిలిచేలా చర్యలు చేపడతాం. పీఎం సూర్యఘర్ కింద మూడు కిలో వాట్ల విద్యుత్ ఉత్పత్తికి బీసీలకు రూ.98 వేల రాయితీ ఇస్తాం. కుప్పం ప్రాంతానికి విమానాశ్రయం వస్తుంది. కుప్పం-హోసూరుకు సమాంతరంగా మరో రోడ్డు నిర్మాణం జరుగుతుంది. నియోజకవర్గానికి పెద్ద ఎత్తున పరిశ్రమలు రానున్నాయని చంద్రబాబు తెలిపారు. రెండు రోజుల పర్యటనలో భాగంగా బుధవారం




బెంగళూరు నుంచి కుప్పం చేరుకున్న సీఎంకు జిల్లా, కుప్పం నియోజకవర్గ నేతలు, కలెక్టర్ సహా ఇతర ఉన్నతాధికారులు స్వాగతం పలికారు. స్వర్ణ కుప్పం ప్రాజెక్టులో భాగంగా మొత్తం రూ.1292.74 కోట్ల విలువైన వివిధ అభివృద్ధి, సంక్షేమ, ప్రత్యేక పథకాలను ముఖ్యమంత్రి ప్రారంభించారు. వీటిలో ఇప్పటికే రూ.125.13 కోట్ల విలువైన అభివృద్ధి పనులు పూర్తి అయ్యాయి.రూ.47 కోట్లతో 30 కిలోమీటర్ల మేర హంద్రీనీవా కాలువ లైనింగ్ పనులు పూర్తయ్యాయి. రూ. 42.5 కోట్ల వ్యయంతో 46 కిలోమీటర్ల మేర సీసీ రహదారులు, 65 కిలోమీటర్ల బీటీ రోడ్లు పూర్తి అయ్యాయి. అలాగే తాగునీటి సరఫరా నిమిత్తం రూ.8.97 కోట్లతో పనులు పూర్తి అవగా.. గోకులం షెడ్లు రూ.7.63, వీధిదీపాలు రూ.3.7 కోట్లు, రూ.1.64 కోట్లతో పాఠశాల కాంపౌండ్ వాల్ నిర్మాణం పూర్తి అయ్యింది.1000 మంది మహిళా లబ్దిదారులకు కొత్తగా గ్యాస్ కనెక్షన్లను, 3041 మంది లబ్దిదారులకు కొత్తగా పెన్షన్లను ముఖ్యమంత్రి అందజేశారు. 7,488 ఎస్సీ ఎస్టీ గృహాలకు రూ.21.80 కోట్ల వ్యయంతో పీఎం సూర్యఘర్ యోజన కింద సోలార్ రూఫ్ టాప్ ప్యానళ్లు ఏర్పాటు చేశారు. వచ్చే ఏడాది జనవరి నాటికల్లా సోలార్ ప్యానళ్లు ఏర్పాటు పూర్తి చేసేలా కార్యాచరణ రూపొందించారు. అలాగే కుప్పం నియోజకవర్గంలో చెత్త సేకరణకు 130 ఎలక్ట్రిక్ ఆటోలను సీఎం ప్రారంభించారు. ఇంటింటి చెత్త సేకరణకు ఎలక్ట్రిక్ ఆటోలను వినియోగిస్తున్న తొలి నియోజకవర్గంగా కుప్పం అవతరించనుంది. కామన్ ట్రీట్‌మెంట్ సెంటర్‌లో చెత్తను రీసైకిల్ చేయటం ద్వారా జీరో ల్యాండ్ ఫిల్ పాలసీ అమలు చేస్తున్న నియోజకవర్గంగా కుప్పం నిలువనుం దన్నారు. అలాగే పేటీఎం సంస్థ సీఎస్ఆర్ నిధులతో అడ్వాన్స్ లైఫ్ సపోర్టు అంబులెన్సులను సీఎం ప్రారంభించారు. 400 అంగన్‌వాడీ కేంద్రాల్లో కేర్ అండ్ గ్రో కార్యక్రమాన్ని కూడా మొదలుపెట్టారు. పీఎం కుసుమ్ పథకం కింద రూ.564 కోట్లతో వ్యవసాయ ఫీడర్లకు సౌర విద్యుత్ అందేలా కార్యాచరణ రూపొందించారు. దీని ద్వారా 32,106 వ్యవసాయ పంపుసెట్లకు సౌర విద్యుత్ అందనుంది. కుప్పంలో టూరిజం అభివృద్ధికి తోడ్పడనున్న లీ కంఫర్ట్ 3 స్టార్ రిసార్ట్‌ను సీఎం చంద్రబాబు ప్రారంభించారు. 1387 మంది దివ్యాంగులకు ఉపకరణాలను అందజేశారు. అలాగే 400 మంది డ్వాక్రా మహిళలకు ఈ-సైకిళ్లు సీఎం చేతుల మీదుగా పంపిణీ జరిగింది. ఈ కార్యక్రమంలో ఎంపీ దగ్గుమల్ల ప్రసాద్, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, అధికారులు పాల్గొన్నారు.

# సంచలన విషయాలు వెల్లడించిన ఈడీ



న్యూఢిల్లీ, జులై 02: నేషనల్ హెరాల్డ్ కేసులో కీలక పరిణామం చోటు చేసుకుంది. సోనియా, రాహుల్ గాంధీలకు సంబంధమున్న అసోసియేటెడ్ జనరల్స్ లిమిటెడ్ (ఏజేఎల్)కు పలువురు సీనియర్ కాంగ్రెస్ పార్టీ నేతలు నకిలీ లావాదేవీలు జరిపారని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) ఆరోపించింది. బుధవారం న్యూఢిల్లీ కోర్టులో ఈడీ తరఫు న్యాయవాది అదనపు సోలిసిటర్ జనరల్ వి. రాజు తన వాదనలు వినిపించారు. చాలా ఏళ్లుగా వీరు మోసపూరితంగా ఇలా అద్దె చెల్లించారన్నారు.అందుకు సంబంధించిన రశీదులను వీరు తయారు చేశారని తెలిపారు. సీనియర్ కాంగ్రెస్ పార్టీ నేతల సూచనల మేరకే ఈ నగదును వీరు ఇలా ఏజేఎల్‌కు బదిలీ చేశారని కోర్టుకు విన్నవించారు. ఇదే తరహాలో.. అంటే కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేతల సూచనల మేరకు అడ్వర్టైజ్‌మెంట్ నిధులు సైతం దారి మళ్లించారని వివరించారు. ఇటువంటి మోసపూరిత మార్గాల ద్వారా వచ్చిన ఆదాయం నేరమని ఈడీ తరఫు న్యాయవాది ఈ సందర్భంగా కోర్టుకు స్పష్టం చేశారు.ఇక ఈ కేసులో దాతలను సైతం ఈడీ ఇప్పటికే ప్రశ్నించిందని గుర్తు చేశారు. అలాగే సీనియర్ నేతలను సైతం విచారించిందని చెప్పారు. అలాగే షేర్ల బదిలీపై ప్రశ్నించాల్సి ఉందన్నారు. సుమన్ దుబే షేర్లను సోనియా గాంధీకి, ఆస్కార్ ఫెర్నాండేజ్ షేర్లను రాహుల్ గాంధీకి బదిలీ చేశారన్నారు. కానీ ఆ తర్వాత ఈ షేర్లను ఆస్కార్ ఫెర్నాండెజ్‌కు తిరిగి బదిలీ చేశారని సోదాహరణగా కోర్టుకు ఆయన వివరించారు. ఇవన్నీ నకిలీ లావాదేవీలని న్యాయవాది వి రాజు ఈ సందర్భంగా పేర్కొన్నారు. అయితే 2015 వరకు ఇద్దరు వ్యక్తులు మాత్రమే ఈ సంస్థ ద్వారా లబ్ధి పొందారని.. వారిద్దరు సోనియా, రాహుల్ గాంధీలు మాత్రమేనని కోర్టుకు న్యాయవాది వి. రాజు తెలిపారు.స్వాతంత్ర్యానికి పూర్వం కాంగ్రెస్ పార్టీ.. తన భావాలను ప్రతిబింబించే విధంగా ఒక పత్రికను ప్రారంభించాలని భావించింది. ఈ ఉద్దేశ్యంతో 1938లో ది నేషనల్ హెరాల్డ్ పత్రికను జవహర్ లాల్ నెహ్రూ ప్రారంభించారు.

# జైలునుంచి వంశీ విడుదల

**బెయిల్ రద్దు చేయాలని సుప్రీంలో పిటిషన్**
**ప్రభుత్వ వాదనను తోసిపుచ్చిన సుప్రం**

విజయవాడ,జులై 2( ): మాజీ ఎమ్మెల్యే, వైసీపీ నేత వల్లభనేని వంశీ విడుదలయ్యారు. బుధవారం విజయవాడ జైలు నుంచి వంశీ విడుదల అయ్యారు. నకిలీ ఇళ్లపట్టాల కేసులో వంశీకి నూజివీడు కోర్టు బెయిల్ మంజూరు చేసింది. దీంతో మధ్యాహ్నం వంశీ బెయిల్ ఆర్డర్ కాపీలతో విజయవాడ సబ్ జైలుకు ఆయన తరపు న్యాయవాదులు చేరుకున్నారు. అలాగే మాజీ మంత్రి పేర్ని నాని, తలశిల రఘురామ్ కూడా సబ్ జైలు దగ్గరకు వచ్చారు. జైలు అధికారులకు వంశీ న్యాయవాదులు బెయిల్ ఆర్డర్ కాపీలను సమర్పించిన తర్వాత మాజీ ఎమ్మెల్యే జైలు నుంచి బయటకు వచ్చారు. కాగా.. వివిధ కేసుల్లో దాదాపు 137 రోజులుగా వంశీ జైలులో ఉన్న విషయం తెలిసిందే. కాగా.. 2019 సార్వత్రిక ఎన్నికల్లో గన్నవరం నియోజకవర్గంలో ఓటర్లను ప్రలోభపెట్టేందుకు నకిలీ ఇళ్ల పట్టాలను పంపిణీ చేశారంటూ వంశీపై ఆరోపణలు ఉన్నాయి. ఈ కేసులో రిమాండ్ ఖైదీగా ఉన్న వంశీ బెయిల్ కోసం నూజివీడు కోర్టును ఆశ్రయించారు. దీనిపై నాలుగు వారాల క్రితమే వాదనలు ముగియగా.. మంగళవారం వంశీకి కోర్టు బెయిల్ మంజూరు చేసింది. అలాగే వంశీపై ఉన్న రెండు కేసుల్లో కూడా గత నెలలోనే ఆయనకు బెయిల్ మంజూరు అయ్యింది. తాజాగా నకిలీ ఇళ్లపట్టాల కేసులో బెయిల్ రావడంతో ఈరోజు వంశీ జైలు నుంచి విడుదలయ్యారు .మరోవైపు అక్రమ మైనింగ్ కేసులో వంశీకి ఇచ్చిన బెయిల్ రద్దు చేయాలంటూ



ఏపీ ప్రభుత్వం వేసిన పిటిషన్‌పై సుప్రీం కోర్టులో విచారణకు వచ్చింది. అక్రమ మైనింగ్‌పై దర్యాప్తు నివేదికను సీల్డ్ కవర్‌లో అందజేయాలని ఆదేశించిన సుప్రీం కోర్టు తదుపరి విచారణను ఈనెల 17కు వాయిదా వేసింది. అలాగే బెయిల్ రద్దు చేయాలన్న ప్రభుత్వ వాదనను తోసిపుచ్చింది.

# శ్రీ రాఘవేంద్ర స్వామి విగ్రహం నిర్మాణం పేరుతో భక్తులకు బురుడీ..

**-శ్రీ మఠంకు హెలికాప్టర్ బహుమతిగా ఇస్తామనే మోసం..**
**-భక్తుల దగ్గర పెద్దమొత్తంలో విరాళాల సేకరణ..**
**-కేటుగాళ్ల మోసపూరిత మాటలను భక్తులు నమ్మవద్దు..**
**శ్రీ మఠం మేనేజర్ ఎస్కే శ్రీనివాసరావు**








మంత్రాలయం, జూలై 2,(శ్రీచక్ర) :బెంగళూరు - మైసూరు హైవే దగ్గర రామ నగర్ లో 253 అడుగుల శ్రీ రాఘవేంద్రస్వామి విగ్రహం నిర్మాణం చేపడుతున్నామని అందుకు విరాళాలను అందించాలని కేటుగాళ్లు భక్తుల దగ్గర పెద్ద మొత్తంలో విరాళాలను సేకరించిన సంఘటన బుధవారం మంత్రాలయం శ్రీ రాఘవేంద్ర స్వామి మఠం మేనేజర్ ఎస్కే శ్రీనివాసరావు దృష్టికి వచ్చింది.ఈ సందర్భంగా ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. ఆ ప్రకటనలో ఇలా.. బెంగళూరు-మైసూరు హైవేలోని రామ నగర్ లో 253 అడుగుల శ్రీ రాఘవేంద్రస్వామి విగ్రహం నిర్మాణం చేపడుతున్నామని, అలాగే శ్రీ రాఘవేంద్ర స్వామి మఠంకు హెలికాప్టర్ బహుమతిగా ఇస్తామని కె. సురేష్ అనే వ్యక్తి పేరు మీద ఉన్న (9611909961) మొబైల్ నెంబర్ కు రూ. 1లక్ష 15 వేలను బదిలీ చేసినట్లు ఓ భక్తుడు వాట్సప్ ద్వారా ఫిర్యాదు అందించారని, డబ్బు అందిన తరువాత ఆయన స్పందిచటం లేదని ఫిర్యాదులో మేనేజర్ ఎస్కే శ్రీనివాసరావు పేర్కొన్నారు. అందిన ఫిర్యాదు మేరకు కె. సురేష్ అనే వ్యక్తి శ్రీ రాఘవేంద్ర స్వామి పేరుతో పెద్ద మొత్తంలో విరాళాలు సేకరిస్తునట్లు అనుమానం వ్యక్తం చేశారు. అలా సేకరించిన నిధులతో శ్రీ రాఘవేంద్ర స్వామి మఠం కు హెలికాప్టర్ బహుమతిగా ఇస్తామనే మోసపూరిత సమాచారం. శ్రీ రాఘవేంద్ర స్వామి మఠం ఎటువంటి వ్యక్తులకు గాని ఏ సంస్థలకు ఏ రూపంలో కూడా డబ్బులు వసూలు చేయడానికి అధికారం ఇవ్వలేదని ప్రకటనలో తెలిపారు. కొన్ని రోజుల క్రితం ఇలాంటి మోసపూరిత కార్యకలాపాలకు పాల్పడుతున్న ఒక నకిలీ వెబ్ సైట్ పై ఫిర్యాదు చేయటం కూడా జరిగిందన్నారు. భక్తులు ఇలాంటి మోసపూరిత మాటలను నమ్మవద్దని అలాంటి సంఘటనలు జరిగితే పోలీసు స్టేషన్ లో ఫిర్యాదు చేయాలని మఠం మేనేజర్ ఎస్కే శ్రీనివాసరావు ప్రకటనలో పేర్కొన్నారు.

# ఏ రాష్ట్రంలో అభివృద్ధి చెందని విధంగా రాష్ట్రంలో ఎయిర్పోర్ట్స్అభివృద్ధి

**కర్నూలు విమానాశ్రయం నుండి కర్నూలు- విజయవాడ విమాన సర్వీస్ లు ప్రారంభం**
**వారం లో 3 రోజుల పాటు విమాన సర్వీస్ లు**
**కర్నూలు జిల్లా ప్రజలు ఈ సర్వీసును సద్వినియోగం చేసుకోవాలి**
**కర్నూలు ఎయిర్ పోర్టు అభివృద్ధికి మరిన్ని చర్యలు తీసుకుంటాం**
**కేంద్ర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు**





కర్నూలు, జూలై 02 (శ్రీచక్ర): ఏ రాష్ట్రంలో అభివృద్ధి చెందని విధంగా ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో ఎయిర్పోర్ట్స్ ను అభివృద్ధి చేసేందుకు ముఖ్య మంత్రి చర్యలు తీసుకుంటున్నారని కేంద్ర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు తెలిపారు. బుధవారం కర్నూలు ఎయిర్పోర్ట్ లో కర్నూలు నుండి విజయవాడ విమాన సర్వీస్ లను కేంద్ర విమానయాన శాఖ మంత్రి ఢిల్లీ నుండి కింజరాపు రామ్మోహన్ నాయుడు వర్చువల్ గా ప్రారంభించారు.. కర్నూలు ఎయిర్ పోర్టు నుండి రాష్ట్ర పరిశ్రమలు వాణిజ్యం ఫుడ్ ప్రాసెసింగ్ శాఖా మంత్రి టీజీ భరత్ , రాష్ట్ర రోడ్లు భవనాలు శాఖా మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి, ఎంపీలు బైరెడ్డి శబరి, బస్తిపాటి నాగరాజు, పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత, ఇంచార్జి కలెక్టర్ డా. బి.నవ్య తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ





సందర్భంగా కేంద్ర విమానయాన శాఖా మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు మాట్లాడుతూ కర్నూలుకి సంబంధించి విజయవాడ కి కనెక్టివిటీ ఇవ్వడం ఎంతో ఆనందాన్ని ఇస్తోందన్నారు. విజయవాడ - కర్నూలు ఫ్లైట్ ఎప్పుడు వేస్తారని ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఉన్న అందరు ప్రజాప్రతినిధులు అడుగుతూనే ఉన్నారన్నారు.. ఉమ్మడి కర్నూలు జిల్లాలకు, అనంతపురం జిల్లాకు ఈ కనెక్టివిటీ ఎంతో ఉపయోగకరమని తెలిపారు.. అలాగే రాష్ట్ర ముఖ్యమంత్రి వర్యులు నారా చంద్రబాబు నాయుడు గారు కొత్త ఎయిర్పోర్ట్ లను అభివృద్ధి చేయడం పై ప్రత్యేకమైన దృష్టి పెట్టారన్నారు... ఏ రాష్ట్రంలో ఎయిర్పోర్ట్స్ అభివృద్ధి చెందని విధంగా అభివృద్ధి చేయాలని, ఒక లాజిస్టిక్స్ హబ్ గా ఆంధ్రప్రదేశ్ ని తయారు చేయాలని, సీఎం ఎంతో పట్టుదలతో ఉన్నారన్నారు.. విశాఖపట్నం, రాజమండ్రి, విజయవాడ, తిరుపతి ఇప్పుడు కర్నూలు, అలాగే కడపలో ప్రతి ఒక్క ఎయిర్పోర్ట్లో గతంలో కంటే ఈ సంవత్సరం కాలంలో అదనంగా ఫ్లైట్ సర్వీస్ లు స్టార్ట్ చేసి సుమారు 15% ఎడిషనల్ కెపాసిటీని మన రాష్ట్రం నుండి పెంచామన్నారు.. అదే విధంగా సివిల్ ఏవియేషన్ లో భోగాపురం, నెల్లూరు, అనంతపూర్, కుప్పం ఇలా రకరకాల ప్రాంతాల్లో కొత్త ఎయిర్పోర్ట్ లు స్టార్ట్ చేయడానికి చంద్రబాబునాయుడు గారి ఆదేశాలతో ముందుకు నడిపించడం జరుగుతుందన్నారు. అదే విధంగా కర్నూలు ఎయిర్పోర్ట్ ను డెవలప్ చేయాలని సీఎం గారు కూడా ఎప్పటికప్పుడు మాకు సలహాలు ఇవ్వడం జరుగుతోందన్నారు. ప్రస్తుతం ఈ సర్వీస్ 3 రోజులు నడిచేలా ప్రారంభించామని, అతి త్వరలో. 7 రోజులు చేసే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. కర్నూలు ఎయిర్పోర్ట్ నుండి అదనపు కనెక్టివిటీ లు ఇచ్చేందుకు కూడా

శ్రీచక్ర
SREECHAKRA TELUGU DAILY



# సంపాదకీయం

## ఆర్థిక గతిని మార్చేసిన జీఎస్టీ

వస్తు, సేవల పన్ను భారత దేశపు పన్ను సంస్కరణల చరిత్రలో ఒక విప్లవాత్మక మలుపు. ఎనిమిదేళ్ల తరువాత 2025లో జీఎస్టీ విధానం దేశ చరిత్రలో అత్యంత ముఖ్యమైన పన్ను సంస్కరణల్లో ఒకటిగా నిలుస్తోందని అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఆర్థిక వ్యవస్థను క్రమబద్ధీకరించడం, పారదర్శకతను పెంచడం, వృద్ధిని పెంపొందించేందుకు విలువ ఆధారిత పన్నులు(వ్యాట్) స్థానంలో జీఎస్టీని ప్రవేశపెడుతున్నట్లు ప్రభుత్వం తెలిపింది. అప్పటి నుంచి నేటి వరకు జీఎస్టీ సాధించిన కొన్ని విజయాల గురించి తెలుసుకుందాం. ఒకే దేశం, ఒకే పన్ను. జీఎస్టీ అమలు ద్వారా 17 వేర్వేరు పన్నులు, 13 సెస్‌లను ఒకే గొడుగు కిందకు తీసుకొచ్చారు. దాంతో గతంలో రాష్ట్రాల్లో ఉన్న పరోక్ష పన్నుల భారం తొలగిపోయింది. ఈ సమన్వయం ఒక ఉమ్మడి జాతీయ విధానాన్ని సృష్టించింది. లాజిస్టిక్స్ ఖర్చులను గణనీయంగా తగ్గించింది. రాష్ట్రాల మధ్య వాణిజ్యాన్ని సులభతరం చేసింది. ప్రతి సంవత్సరం జులై మొదటి తేదీని వస్తు సేవల పన్ను దినోత్సవంగా దేశంలో పాటిస్తున్నారు. ఇది కేవలం ఒక పన్ను విధానం ఆవిర్భావ దినోత్సవం మాత్రమే కాదు, భారతదేశ ఆర్థిక వ్యవస్థకు ఓ సుస్థిర మార్గాన్ని ఏర్పరిచిన ఘట్టం. దేశవ్యాప్తంగా పన్నుల పరంగా అనేక మోడళ్ల మధ్య జరుగుతున్న గందరగోళానికి ముగింపు పలికిన మలుపు. వస్తు సేవల పన్ను అమలుకు దారితీసిన అవసరాలు ఎన్నో. కొంతకాలం క్రితమే మన దేశంలో విక్రయపు పన్ను, ఎక్సైజ్ సుంకం, సేవలపై పన్ను, రాష్ట్రాల మధ్య వ్యాపార లావాదేవీలపై వేర్వేరు పన్నులు, ప్రవేశపు పన్ను వంటి అనేక రకాల పన్నులు అమలులో ఉండేవి. రాష్ట్రానికి ఒక విధానం, మరో రాష్ట్రానికి మరో విధానంతో వ్యాపార రంగం సంక్లిష్టతలతో కొట్టుమిట్టాడేది. దేశ వ్యాప్తంగా సమగ్ర వ్యాపార వాతావరణం ఏర్పడలేకపోయింది. ఈ సమస్యలన్నింటికీ పరిష్కారంగా ఒకే విధమైన పన్ను విధానాన్ని రూపొందించారు. దీని ఫలితంగా దేశవ్యాప్తంగా ఒకే పన్ను విధానం అమలులోకి వచ్చింది. దీనివల్ల పన్నుల వ్యవస్థసరళతరం అయింది. వ్యాపారులు పన్నుల వివరాలు సమర్పించడంలో నూతన సాంకేతిక పద్ధతులను ఉపయోగించటం ప్రారంభించారు. ఈ పన్ను విధానం మూడు భాగాలుగా విభజించబడింది. తయారీదారునుండి తుది వినియోగదారుని వరకు ప్రతి దశలో విధించబడే పన్నును తక్షణమే ముందుగానే చెల్లించిన పన్నుతో సమన్వయం చేసుకునే అవకాశం కల్పించబడింది. దాని వల్ల ఒకే వస్తువుపై పన్ను మీద పన్ను విధించే పరిస్థితి లేకుండాపోయింది. ఈ విధానంలో కేంద్రానికి ఒక భాగం, రాష్ట్రానికి మరో భాగం లభించేలా పన్ను వసూలు జరుగుతుంది. అంతర్రాష్ట్ర వ్యాపార లావాదేవీలపై ప్రత్యేకంగా మరో విధానంలో వసూలు జరుగుతుంది. దీనివల్ల రాష్ట్రాల మధ్య వస్తువుల రవాణా సులభతరమైంది. వాణిజ్యానికి ఆటంకాలు తొలగిపోయాయి. ప్రస్తుతం ఈ పన్ను విధానం నాలుగు ప్రధాన శ్రేణులుగా విభజించ బడింది. అవసరమైన నిత్యావసర వస్తువులకు తక్కువ శాతం, విలాస వస్తువులకు ఎక్కువ శాతం విధించబడుతున్నాయి. దీనివల్ల సామాన్యులపై భారం తగ్గించబడి, విలాస వస్తువుల వినియోగంపై నియంత్రణ సాధించబడుతోంది. ఈ పన్ను విధానం ప్రారంభం తరువాత ప్రభుత్వ ఆదాయ వనరులు గణనీయంగా పెరిగాయి. 2024-25 ఆర్థిక సంవత్సరంలో పన్ను ద్వారా వచ్చిన ఆదాయం 22.08 లక్షల కోట్ల రూపాయలకుపైగా ఉండటం గమనించదగినది. ఇది పాలనా సామర్థ్యాన్ని సూచించడమే కాదు, పన్ను చెల్లింపులో పారదర్శకతను, ప్రజల నమ్మకాన్ని ప్రతిబింబిస్తోంది. అయితే, దీనిలో కొన్ని సవాళ్లు ఇప్పటికీ ఎదురవుతున్నాయి. ముఖ్యంగా చిన్న, మధ్య తరహా వ్యాపారులు ఈ పద్ధతిలో పూర్తిగా స్థిరపడలేకపోతున్నారు. పన్ను వేదికపై సాంకేతిక సమస్యలు, ఖాతాల సర్దుబాటు లోపాలు, ఎంటరైన పన్ను మొత్తాన్ని తిరిగి వాడుకునే అవకాశాలపై చిక్కులు, తరచూ మారే నిబంధనలు వీటన్నీ వ్యవస్థపై కొంత అస్పష్టత కలిగిస్తున్నాయి. వస్తు సేవల పన్ను దినోత్సవం అనేది ఈ విధానంపై ప్రజలలో అవగాహన పెంపు, ప్రయోజనాలపై చర్చలు, విధాన బలాలపై మద్దతు, లోపాలపై పరిష్కారాలకు మార్గదర్శనం చేసే సందర్భంగా పరిగణించాలి. కేంద్ర ప్రభుత్వంతోపాటు రాష్ట్రాలు, పరిశ్రమల సంఘాలు, వాణిజ్య మండలాలు ఈ దినాన్ని పురస్కరించుకొని అవగాహన కార్యక్రమాలు, సదస్సులు, వర్క్‌షాపులు నిర్వహించడం ప్రాశస్త్యం. ఈ విధానం ద్వారా దేశీయ పెట్టుబడులే కాకుండా, విదేశీ పెట్టుబడులకు కూడా అనుకూల వాతావరణం ఏర్పడింది. వ్యాపారానికి అనువైన విధానంగా దీన్ని అంతర్జాతీయంగా గుర్తిస్తున్నారు. మొత్తంగా ఇది కేవలం పన్ను విధానం కాదని, దేశఆర్థిక సమీకరణకు ఒక నూతన దిశనిచ్చిన మార్గదర్శకంగా నిలుస్తున్నది. పన్ను చెల్లింపు దారులు, వ్యాపారులు, పాలకులు, ప్రజలందరూ ఈ వ్యవస్థను మరింత సమర్థవంతంగా మార్చుకోవాలన్న సంకల్పంతో ముందుకు సాగాల్సిన అవసరం ఉంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా పన్నుల వ్యవస్థను నడిపించేలా జీఎస్టీ కౌన్సిల్ ఇప్పటి వరకు 55కి పైగా సమావేశాలు నిర్వహించింది. ఉమ్మడి నిర్ణయాలు తీసుకోవడానికి ఈ వేదిక సహకారాన్ని పెంపొందించడమే కాకుండా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక అవసరాలను తీర్చేలా వీలు కల్పించింది. జీఎస్టీ పన్ను వ్యవస్థలో పెనుమార్పులు తీసుకువచ్చినప్పటికీ రేట్ల సరళీకరణ, కాంప్లయన్స్ లోపాలను పరిష్కరించడం, ఐటీ మౌలిక సదుపాయాలను మెరుగుపరచడం వంటి సవాళ్లు కొనసాగుతున్నాయి.

# ఏ రాష్ట్రంలో అభివృద్ధి చెందని విధంగా రాష్ట్రంలో ఎయిర్పోర్ట్స్ అభివృద్ధి

మెదటిపేజీ తరువాయి...

పూర్తి స్థాయిలో సహాయ సహకారాలు అందిస్తామన్నారు. కేంద్ర ప్రభుత్వం సహాయ సహకారాలతో ఓర్వకల్లు ఇండస్ట్రియల్ నోడ్ శరవేగంగా అభివృద్ధి చేసే దిశగా ముందుకు వెళ్తున్నామన్నారు.. కర్నూలు నుండి అనంతపురం వరకు 5 ముఖ్యమైన ఇండస్ట్రియల్ రంగాలఅభివృద్ధికి కృషి చేస్తున్నట్లు ముఖ్యమంత్రి చెప్పడం జరిగిందన్నారు..ముఖ్యంగా ఓర్వకల్లు నోడ్ లో డ్రోన్ హబ్ ను తయారు చేయాలని, ఏరోస్పేస్ మాన్యుఫాక్చరింగ్, డిఫెన్స్ తదితర ఇండస్ట్రియల్ సెక్టార్ ల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు.. కర్నూలు ప్రాంతం అభివృద్ధి చెందడంలో ఓర్వకల్లు ఎయిర్పోర్ట్ కీలక పాత్ర పోసిస్తుందని కేంద్ర మంత్రి పేర్కొన్నారు. అలాగే కర్నూలు ఎయిర్పోర్ట్లో నైట్ ల్యాండింగ్ చేసేందుకు కూడా చర్యలు తీసుకుంటామని తెలిపారు.. కర్నూలు జిల్లా ప్రజలు ఈ సర్వీసును సద్వినియోగం చేసుకొని 100% ఆక్యుపెన్సీ ఉండే విధంగా సహకరించాలని, ఎయిర్ పోర్ట్ సేవలను ప్రోత్సహించాలని కేంద్రమంత్రి విజ్ఞప్తి చేశారు..రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి మాట్లాడుతూ కర్నూలు - విజయవాడ ఫ్లైట్ ను ప్రారంభించిన ఇండిగో సంస్థకు ధన్యవాదాలు తెలిపారు. తాను కట్టించిన ఎయిర్పోర్ట్ లో ఈ కార్యక్రమంలో పాల్గొనడం చాలా సంతోషంగా ఉందన్నారు.. అదేవిధంగా ఇంకా పలు ప్రాంతాలలకు ఫ్లైట్స్ ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని, అందుకు సంబంధించిన ప్రతిపాదనలు పంపుతామని, వాటిని ఏర్పాటు చేయాలని కేంద్రమంత్రిని కోరారు..అదేవిధంగా కర్నూలు ఎయిర్ పోర్ట్ లో నైట్ ల్యాండింగ్ ఏర్పాటు చేయాలని, ఈ ప్రాంతం ఇండస్ట్రియల్ హబ్ గా మారుతున్నందున రాబోయే కాలంలో ఇది చాలా అవసరమని తెలిపారు.. కర్నూలు ఎయిర్ పోర్ట్ నుండి ప్రతిరోజు ఫ్లైట్లు తిరిగే విధంగా కూడా చర్యలు తీసుకోవాలని, ఉదయం ఏడు గంటలకు ఇక్కడ ఎయిర్ పోర్ట్ నుంచి విజయవాడకు వెళ్లే విధంగా, అదేవిధంగా విజయవాడ నుంచి సాయంత్రం ఐదు గంటలకు కర్నూలు ఎయిర్పోర్ట్ కు వచ్చే విధంగా ఫ్లైట్ టైమింగ్స్ మార్చాలని మంత్రి కేంద్ర మంత్రిని కోరారు. రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టీజీ భరత్ మాట్లాడుతూ కర్నూలు - విజయవాడ ఫ్లైట్ సర్వీసులు ప్రారంభించడం చాలా సంతోషంగా ఉందని తెలిపారు.. కేంద్ర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు కృషి వల్ల ఇది సాధ్యమైందని తెలిపారు.. ఈ సర్వీసులను ప్రారంభించడం పట్ల అనంతపురం, కర్నూలు జిల్లాల ప్రజలు సంతోషపడుతున్నారని తెలిపారు.. అదే విధంగా కర్నూలు ఎయిర్పోర్టులో నైట్ ల్యాండింగ్ ఏర్పాటుకు కూడా కృషిచేయాలని మంత్రి కేంద్ర మంత్రికి విజ్ఞప్తి చేశారు..ఓర్వకల్లు ఇండస్ట్రియల్ జోన్ ఉండడం వల్ల చాలామంది పారిశ్రామికవేత్తలు తరచుగా ప్రయాణించవలసిన అవసరం ఉంటుందని, అందువల్ల కర్నూలు ఎయిర్పోర్ట్ లో నైట్ లాండింగ్ ఏర్పాటుకు కూడా కృషి చేయాలని మంత్రి విజ్ఞప్తి చేశారు. కర్నూలు పార్లమెంట్ సభ్యులు బస్తిపాటి నాగరాజు మాట్లాడుతూ రాష్ట్రంలో ఈరోజు సుపరిపాల తొలి అడుగు అనే కార్యక్రమాన్ని ప్రారంభించడం జరిగిందని, ఇదే రోజు ఓర్వకల్లు విమానాశ్రయం నుండి విజయవాడకు కొత్త విమాన సర్వీసు ప్రారంభం చేసుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు.. కేంద్ర , రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ఒక సంవత్సరం లోనే ఇది సాధించడం సంతోషంగా ఉందన్నారు.. అలాగే మరింత అభివృద్ధితో ఈ విమానాశ్రయం రూపు రేఖలు మార్చాలని, శ్రీ నైట్ ల్యాండింగ్ సౌకర్యం కూడా కల్పించాలని పార్లమెంటు సభ్యులు కేంద్రమంత్రి ని కోరారు. నంద్యాల పార్లమెంట్ సభ్యులు బైరెడ్డి శబరి మాట్లాడుతూ కర్నూలు నుండి విజయవాడ కు విమాన సర్వీసులను ప్రారంభించడం చాలా సంతోషంగా ఉందన్నారు..అలాగే ఎయిర్పోర్ట్ మరింత అభివృద్ధి చెందే విధంగా చర్యలు తీసుకోవాలని, నైట్ ల్యాండింగ్ ఏర్పాటు చేయాలని కోరారు.కర్నూలు ఎయిర్ పోర్ట్ కు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి ఎయిర్పోర్ట్ గా పేరును అధికారికంగా ప్రకటించేలా ఎంపీ కేంద్ర మంత్రి కి విజ్ఞప్తి చేశారు. పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత మాట్లాడుతూ కర్నూలు విజయవాడ విమాన సర్వీసులు ప్రారంభించడం చాలా సంతోషంగా ఉందన్నారు.. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు గారి కృషి వల్లే ఈ ప్రాంతము ఇండస్ట్రియల్ హబ్ గా రూపొందిందని, కర్నూలు ఎయిర్పోర్ట్ ఏర్పాటు అయిందని ఎమ్మెల్యే తెలిపారు. విజయవాడ వెళ్లాలంటే చాలా ఇబ్బందిగా ఉండేదని, ఈ సర్వీసులను ప్రారంభించడం వల్ల పారిశ్రామికవేత్తలకు, ఉద్యోగులకు, రాజకీయ నాయకులకు చాలా ఉపయోగముంటుందని ఎమ్మెల్యే తెలిపారు. ముందుగా కార్యక్రమాన్ని వర్చువల్ విధానం ద్వారా కేంద్ర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు గారు జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించి, కర్నూలు విజయవాడ ఇండిగో విమాన సర్వీస్ లను జెండా ఊపి ప్రారంభించారు.. అనంతరం భీమప్ప పూజారి అనే ప్యాసింజర్ కి మొదటి బోర్డింగ్ టికెట్ ను మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యే, ఇంచార్జి కలెక్టర్ అందచేశారు..కార్యక్రమంలో ఇంచార్జి కలెక్టర్ డా. బి.నవ్య, కర్నూలు ఆర్డీఓ సందీప్ కుమార్, ఎయిర్పోర్ట్ డైరెక్టర్ విద్యా సాగర్, ఇండిగో కంపెనీ రీజినల్ హెడ్ ఆఫ్ సెక్యూరిటీ జిబు జాన్, అసిస్టెంట్ మేనేజర్, కౌశల్, రీజినల్ మేనేజర్, ప్రశాంత్ , రీజినల్ మేనేజర్ సేఫ్టీ జాక్సన్ జార్జ్ లు తదితరులు పాల్గొన్నారు.

# తప్పిపోయిన మహిళ అప్పగింత



మంత్రాలయం , జూలై 2,(శ్రీచక్ర) : తప్పిపోయిన మహిళ ను కర్ణాటక రాష్ట్రంలోని రాయచూరు కు చెందిన పోలీసులకు అప్పగించినట్లు ఎస్ ఐ శివాంజల్ తెలిపారు. బుధవారం కుటుంబ కలహాల కారణంగా శివమ్మ అనే మహిళ తన ఇద్దరి పిల్లలతో కలిసి ఇంటి నుంచి బయటకు వచ్చినట్లు చెప్పారు. బంధువులు రాయచూరు పోలీసులకు ఫిర్యాదు చేయడం వల్ల కర్ణాటక పోలీసుల ద్వారా వచ్చిన సమాచారం మేరకు స్థానిక శ్రీ రాఘవేంద్రస్వామి మఠం ఆవరణంలో గాలింపు చర్యలు చేపట్టామని తెలిపారు. ఇందులో భాగంగా శివమ్మ ను గుర్తించి స్థానిక పోలీస్టేషన్ కు తీసుకొచ్చి రాయచూరు పోలీసులకు అప్పగించినట్లు ఆయన తెలిపారు.

# ఫ్రీ బస్సు కోసం పక్కా ప్లాన్




విజయవాడ, జూలై 2, ఎన్నికల్లో హమీ ఇచ్చిన సూపర్ సిక్స్ పథకంలోని మరో పథకం అమలుకు కూటమి ప్రభుత్వం తుది కసరత్తు చేస్తోంది. ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యాన్ని ఈ ఏడాది ఆగస్ట్ 15 నుంచి కల్పించనున్నారు. పథకం అమలుతో పెరిగే ఆక్యుపెన్సీకి తగ్గట్టు బస్సులు సంఖ్య పెంచేలా చర్యలు తీసుకోవాలని సీఎం చంద్రబాబు సూచించారు. ఇందుకు కొత్త బస్సులు కొనడం గానీ, అవసరమైతే అద్దెకు తీసుకోవడం గానీ చేయాలన్నారు. ఇకపై ఆర్టీసీలో ప్రవేశపెట్టేవన్నీ ఈవీ ఏసీ బస్సులే ఉండాలని? ఇప్పుడున్న బస్సులను కూడా ఈవీలుగా మార్చేందుకు ఉన్న అవకాశాలపై అధ్యయనం చేయాలని చెప్పారు. అలాగే, ప్రతీ బస్సుకు జీపీఎస్ తప్పనిసరిగా అమర్చాలని ముఖ్యమంత్రి అధికారులకు నిర్దేశించారు. ఆర్థిక కష్టాలను అధిగమించాలంటే ఆర్టీసీ ఆదాయ మార్గాలను పెంచుకోవాలని ముఖ్యమంత్రి సూచించారు. ఖర్చు ఎలా తగ్గించుకోవాలి... ఇతర మార్గాల ద్వారా ఆదాయాలను ఎలా పొందాలి అనే దానిపై దృష్టి పెట్టాలన్నారు. ముఖ్యంగా సమర్థత పెంచుకోవాలని చెప్పారు. బస్ కాంప్లెక్స్‌లో టాయిలెట్లు పరిశుభ్రంగా ఉంచడం దగ్గర నుంచి బస్సు ప్రయాణం వరకు ప్రయాణికుల్లో సంతృప్తి పెరిగేలా నిర్వహణ ఉండాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.'బ్యాటరీ స్వాపింగ్ విధానంతో ఆర్టీసీ బస్సుల నిర్వహణ వ్యయం తగ్గే అంశాన్ని పరిశీలించాలి. డీజిల్, ఈవీ, సీఎన్జీ, బ్యాటరీ స్వైపింగ్... ఇలా ఏ బస్సు కొనుగోలు, నిర్వహణకు ఎంత వ్యయం అవుతుందనే ప్రతిపాదనలు రూపొందించండి. బ్యాటరీ, బ్యాటరీ లేకుండా, సర్వీస్ స్టేషన్లను ప్రైవేట్ సంస్థలు నిర్వహించడం, బస్సులను ఆపరేట్ చేయడం... ఇలా ఏ విధానంతో వ్యయం తగ్గుతుందనేది పరిశీలించండి" అని సీఎం చంద్రబాబు అధికారులను ఆదేశించారు. కొత్త పథకం అమలుకు అదనంగా మరో 2,536 బస్సులు అవసరమని అధికారులు లెక్కలు తేల్చారు. దీనికి రూ.996 కోట్లు వ్యయం కానుందని భావిస్తున్నారు. అలాగే బస్ స్టేషన్లో తాగునీటి సౌకర్యం, టాయిలెట్ల నిర్వహణ, బస్సుల సమాచార బోర్డులు, ఇతర సౌకర్యాలను మెరుగుపరచాల్సి ఉందిని సీఎంకు అధికారులు వివరించారు. రాష్ట్రంలో మొత్తం జనాభా 5.25 కోట్లు ఉంటే అందులో మహిళలు 2.62 కోట్లు ఉన్నారు. వీరిలో పల్లె వెలుగు, అల్ట్రా పల్లె వెలుగు, సిటీ బస్సుల్లో మహిళల ప్రయాణాల సంఖ్య ప్రస్తుతం ఏడాదికి 43.06 కోట్లుగా ఉంది. ఉచిత బస్సు ప్రయాణ పథకం అమలు చేసిన తర్వాత ఇది 75.51 కోట్లకు పెరగొచ్చని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. ప్రతి మహిళ సగటున వారానికి ఒకసారి అయినా ప్రయాణిస్తుంటారని తెలిపారు. ఎక్స్‌ప్రెస్, మెట్రో ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో ప్రస్తుతం మహిళల ప్రయాణాల సంఖ్య 6.85 కోట్లుగా ఉంది. పథకం అమలు తర్వాత ఈ సంఖ్య 13.39 కోట్లకు పెరగొచ్చు. మొత్తమ్మీద ఉచిత బస్సు పథకంతో మహిళలు ఏడాదిలో 88.90 కోట్ల సార్లు ప్రయాణించే వీలుంది. ప్రస్తుతం ఢిల్లీ, పంజాబ్, తమిళనాడు, కర్నాటక, తెలంగాణలో మహిళలకు ఉచిత బస్సు రవాణా సౌకర్యం కల్పిస్తున్నాయి. అయితే ఒక్కో రాష్ట్రంలో ఒక్కో విధానాన్ని అనుసరిస్తున్నారు. మన రాష్ట్రంలో ప్రవేశ పెట్టే విధానం అత్యుత్తమంగా, సంతృప్తి కలిగేలా... ఉండాలని మొత్తం బస్సుల్లో 57 శాతం పల్లె వెలుగు, అల్ట్రా పల్లె వెలుగు, సిటీ బస్సులు ఉన్నాయి.

# రెడ్డి సామాజంపై అసత్య ఆరోపణలపై ఆగ్రహం

## బాధ్యులపై చర్యలు తీసుకోవాలి జేసీ, డీఎస్పీలకు వినతి



కర్నూలు, జులై 2 (శ్రీచక్ర): రెడ్డి సామాజంపై సోషల్ మీడియాలో అసత్య ఆరోపణలతో కూడిన దుష్ప్రచారం జరుపుతున్నవారిపై ఆంధ్రప్రదేశ్ రెడ్డి సంక్షేమ సంఘం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తోంది. ఈ మేరకు సంఘం రాష్ట్ర అధ్యక్షులు బిర్రు ప్రతాపరెడ్డి స్పందిస్తూ రాష్ట్రంలో సామాజిక శాంతి భద్రతలకు భంగం కలిగించేలా ఇటువంటి కుట్రలను సహించబోమని స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో సంఘం ఉమ్మడి కర్నూలు జిల్లా శాఖ ఆధ్వర్యంలో జిల్లా అధ్యక్షులు పల్లె శ్రీధర్ రెడ్డి అధ్యక్షతన కీలక వినతిపత్రాలు అందజేయడం జరిగింది. బుధవారం కర్నూలు జాయింట్ కలెక్టర్ శ్రీమతి బి. నవ్యకి వినతిపత్రం, అసత్య ఆరోపణలపై విచారణ జరిపి బాధ్యులపై తక్షణ చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. సామాజిక శాంతి భద్రతలకు భంగం కలిగించేలా ఉన్న దుష్ప్రచారాన్ని ఆపాలని కోరారు. కర్నూలు డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ బాబు ప్రసాద్ కి ఫిర్యాదు చేశారు. విభజనకర కరపత్రాలపై పోలీసు శాఖ స్పందించి బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రచారంలో ఆర్ ఎస్ ఎస్ పేరును అనవసరంగా లాగడం, రెడ్డి సామాజాన్ని హిందూ విరుద్ధ శక్తిగా చిత్రీకరించడం, కుల విద్వేషాలు రెచ్చగొట్టేలా వ్యాఖ్యలు చేయడం వంటి అంశాలపై సంఘం తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. రెడ్డి సామాజానికి చెందిన అనేకమంది ఆర్ ఎస్ ఎస్ కార్యకర్తలు, నేతలు ఉన్నారని, ఈ దుష్ప్రచారం వారి మనోభావాలను గాయపరుస్తోందని సంఘం నేతలు పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా సామాజిక సమరసతకు భంగం కలిగించే ఇటువంటి దుష్టశక్తులనుచట్టపరంగానిలువరించాలనిడిమాండ్‌చేశారు. అధికారులను కలిసిన ప్రతినిధి బృందం సభ్యులు తూముకుంట ప్రతాపరెడ్డి, ఇన్నెం రజనీకాంత్ రెడ్డి, రాధా రెడ్డి, సింగం సోమశేఖర్ రెడ్డి, హరినాథ్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, సురారెడ్డి, మధుసూధన రెడ్డి, వెంకట సుబ్బారెడ్డి, వినీష్ రెడ్డి, చల్లాశేషు రెడ్డి, కోట్ల తిమ్మారెడ్డి, శేఖర్ రెడ్డి, కిషోర్ రెడ్డి, నాగిరెడ్డి, రాజేశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## రచ్చుమర్రిలో అక్రమ రిజిస్ట్రేషన్‌పై.. తహసీల్దార్ విచారణ



మంత్రాలయం,జూలై 2,(శ్రీచక్ర) : మండల పరిధిలోని రచ్చుమర్రి గ్రామానికి చెందిన కడతట్ల వెంకటలక్ష్మి కి చెందిన పొలంను కొందరు అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. ఈ విషయం పై గత నెల 27 తేదిన మంత్రాలయం తహసిల్దార్ రమాదేవి కి విచారణ జరిపి న్యాయం చేయాలని వినతి పత్రం అందించారు. విచారణలో భాగంగా బుధవారం రచ్చుమర్రి లో తహసీల్దార్ రమాదేవి, ఆర్ ఐ జనార్ధన్ రావు , మండల సర్వేయర్ అశోక్ కుమార్ లు రిజిస్టర్డ్ డాక్యుమెంట్ నంబరు 90/2004 ద్వారా సర్వే నంబరు 451/o1 లో 0.42 సెంట్ల భూమి పై ఇరువర్గాల కడతట్ల వెంకటలక్ష్మి, మజ్జిగ రామదాసు ల పొలం పత్రాలు పరిశీలించారు. ఇందులో మజ్జిగ రామదాసు పొలం పత్రాలలో రామదాసు పేరు కాకుండా వేరే వారి పేరు ఉండడంతో నీకు పొలం ఎటువంటి సంబంధం లేదని తహసీల్దార్ రమాదేవి సూచించారు. కడతట్ల వెంకటలక్ష్మి పత్రాలు సక్రమంగా ఉన్నాయని ఆమె తెలిపారు. విచారణ జరిపి నివేదిక తయారు చేయాలని ఆర్ ఐ జనార్ధన్ రావు, మండల సర్వేయర్ అశోక్ లను ఆదేశించారు. వీరు ఇచ్చిన నివేదిక ను ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ కు పంపడం జరుగుతుందని తెలిపారు. సబ్ కలెక్టర్ ఆదేశాల మేరకు తగు చర్యలు తీసుకుంటామని ఆమె తెలిపారు. ఈ విచారణలో వీఆర్వో రంగస్వామి, రైతు కడతట్ల నరసింహులు, చుట్టు పక్కల రైతులు ఉన్నారు.

## రోడ్డుపై ప్రవహిస్తున్న మురుగునీరు.. పట్టించుకోని పాలకులు..ఇబ్బందుల్లో ప్రయాణికులు, గ్రామస్తులు.

వెల్దుర్తి జులై 02 (శ్రీ చక్ర) : మండల పరిధిలోని రత్న పల్లె గ్రామంలో సీసీ రోడ్డుకు ఇరువైపులా మురుగు కాలువలు లేక ఇబ్బందులు పడుతున్న వైనం రత్నపల్లి గ్రామంలో చోటుచేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల మేరకు ఇలా ఉన్నాయి. గతపదిసంవత్సరాలనుండి మా గ్రామంలో సిసి రోడ్లకు ఇరువైపులా మురుగుకాలువలులేక రోడ్డుపై వర్షపు నీరు, గ్రామం నుండి వచ్చే మురుగునీరు రోడ్డుపైనే ప్రవహిస్తున్నాయని అన్నారు. పాలకులు మాత్రంపట్టించుకున్నపాపాన పోలేదని గ్రామ ప్రజలు వాపోతున్నారు. మా గ్రామంలోని సిసి రోడ్లు నిర్మాణం జరిగిన ఇరువైపులా మురుగు కాలువలు నిర్మించి మా గ్రామంలోని ప్రజలకు ప్రయాణికులకు ఇబ్బందులు తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.



## టీడీపీ ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చుకుంటోంది

### -మంత్రాలయం టీడీపీ ఇన్చార్జి ఎన్. రాఘవేంద్రరెడ్డి



మంత్రాలయం , జూలై 2,(శ్రీచక్ర) : ఎన్నికల వేళ తెదేపా ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చుకుంటూ అభివృద్ధి లో ముందుకెళ్తోందని మంత్రాలయం టీడీపీ నియోజకవర్గ ఇన్చార్జి ఎన్. రాఘవేంద్ర రెడ్డి అన్నారు. తెదేపా పార్టీ ఆదేశాలు మేరకు బుధవారం మండల పరిధిలోని చెట్నేహాళ్ళి గ్రామంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ముందుగా గ్రామానికి చేరుకున్న ఆయన కు గ్రామ టీడీపీ నాయకులు చాపలనాగేష్ , మేకల మల్లేష్ , డీలర్ గోపాల్ , హనుమంతు లు స్వాగతం పలికారు. అనంతరం ఇంటింటికీ వెళ్ళి ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ , అభివృద్ధి పథకాలను ప్రజలకు ,కరపత్రాలుఅందించి,అభిప్రాయాలు తెలుసు కు న్నారు. ఈ కార్యక్రమంలో గోపాల్ రెడ్డి చావిడి వెంకటేష్ ,అశోక్ రెడ్డి, వరదరాజులు,నాగేష్, మల్లేష్ మాలపల్లి లక్ష్మన్న, శివ, చిదానంద మరియు తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో గోపాల్ రెడ్డి చావిడి వెంకటేష్ , వరదరాజులు, బంగారు నరసింహ ,మాలపల్లి ఆర్ లక్ష్మన్న, రాఘవేంద్ర , శివ, చిదానంద మరియు తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## విద్యార్థులు ఈవ్ టీజింగ్ కు దూరంగా ఉండాలి ఎస్సై శివాంజుల్



మంత్రాలయం , జులై 2,(శ్రీచక్ర) : విద్యార్థులు ఈవ్ టీజింగ్ కు దూరంగా ఉండాలని మంత్రాలయం ఎస్సై శివాంజుల్ అన్నారు. బుధవారం కర్నూలు జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆదేశాలు మేరకు మంత్రాలయంలోని రాఘవేంద్ర డీగ్రి కళాశాలలో విద్యార్థులకు సైబర్ నేరాలు , ఈవ్ టీజింగ్ , రోడ్డు ప్రమాదాలు పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సైబర్ మోసాలు పట్ల బాలికలు అప్రమత్తంగా ఉండాలన్నారు.సైబర్ నేరాలు , వాటి వల్ల కలిగే నష్టాలు ,తీసుకోవల్సిన జాగ్రత్తలపై వివరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల యాజమాన్యం ,విద్యార్థులు పాల్గొన్నారు

## నాయకులారా.. రోడ్డును పట్టించుకోండి..

### -మురికి కాలువను తలపిస్తున్న రోడ్డు



మంత్రాలయం, జూలై 2(శ్రీచక్ర) : సంవత్సరాలు గడిచినా ఊరి తలరాత మారని వైనం. మంత్రాలయం మండల పరిధిలోని చెట్నీహళ్లి గ్రామంలో రోడ్డు నిర్మాణ పనులు పట్టించుకున్న నాయకులే కరువయ్యారని కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత కొన్ని ఏళ్లుగా చెట్నీహళ్లి గ్రామంలో రోడ్డు లేక కాలనీ వాసులు నానా ఇబ్బందులు పడుతున్నారు .రోడ్డుపైనే మురికి నీరు నిల్వ ఉండటంతో దుర్వాసన వస్తుంది. అయితే ఎన్నికల ప్రచార సమయంలో వచ్చిన ప్రతి రాజకీయ నాయకులకు మాగోడు విన్నవించుకున్నా పట్టించుకోవడం లేదని కాలనీ వాసులు ఆరోపిస్తున్నారు. అయితే బుధవారం మంత్రాలయం నియోజకవర్గం తెలుగు దేశం పార్టీ ఇన్ చార్జ్ ఎన్ రాఘవేంద్ర రెడ్డి టీడీపీ ప్రభుత్వం ఏర్పాటు చేసిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమానికి ఆయన చెట్నీహళ్లికి వచ్చారు. ఆ కాలనీలో పర్యటిస్తున్న టీడీపీ ఇన్ చార్జ్ ఎన్ రాఘవేంద్ర రెడ్డి దృష్టికి కాలనీ వాసులు తీసుకెళ్లారు. రోడ్డును పరిశీలించిన ఆయన సంబంధిత అధికారులతో చర్చించి రోడ్డు వేయిస్తానని వారికి హామీ ఇచ్చారు



# సైబర్ నేరాల బారిన పడకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

### నేరాల బారిన పడితే వెంటనే టోల్ ఫ్రీ నెంబర్ 1930 కాల్ చేసి సమాచారం అందించి ఫిర్యాదు చేయాలి కర్నూలు జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్





కర్నూలు, జూలై 2 (శ్రీచక్ర): సైబర్ నేర గాళ్ళచేతిలో మోసపోకుండా ప్రజలకు అవగాహన కల్పించేందుకు " నేను సైబర్ స్మార్ట్ " కార్యక్రమం ను కొనసాగిస్తున్నట్లు కర్నూలు జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ బుధవారం తెలిపారు. పట్టణాలు, గ్రామాలలోని ప్రధాన కూడలలో, రద్దీ ప్రాంతాలలో ప్రజలకు సైబర్ నేరాల బారిన పడకూడదని పోలీసులు అవగాహన కల్పిస్తున్నారు. ఎవరైనా సైబర్ నేరాల బారిన పడితే వెంటనే టోల్ ఫ్రీ నెంబర్ 1930 కాల్ చేసి సమాచారం అందించి ఫిర్యాదు చేయాలన్నారు. సైబర్ క్రైమ్ జరిగిన ఒక గంట లోపే సైబర్ క్రైం హెల్ప్ లైన్ నెంబర్ 1930కి ఫిర్యాదు చేస్తే తప్పక న్యాయం జరుగుతుందన్నారు. సైబర్ క్రైమ్ పోర్టల్ సైబర్క్రైమ్ .గోవ్ .ఇన్ లో బాధితులు వివరాలు నమోదు చేయాలన్నారు. స్థానిక పోలీస్ స్టేషన్ పోలీసు అధికారులను సంప్రదించి సైబర్ నేరం జరిగిన వివరాలను తెలియజేయాలన్నారు.38 పోలీసు స్టేషన్ పరిధులలో ఇప్పటివరకు 2,460 " నేను సైబర్ స్మార్ట్ " అవగాహన కార్యక్రమాలు నిర్వహించామన్నారు. 1,74, 758 మంది ప్రజలకు సైబర్ నేరాల బారిన పడకూడదని అవగాహన కల్పించారు. ఉద్యోగాల పేరుతో వర్క్ ఫ్రం హోం అంటూ కొందరు మోసం చేసేందుకు ప్రయత్నిస్తున్నా రని, యువత తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలన్నారు. డిజిటల్ అరెస్టు, జాబ్ ఫ్రాడ్స్, కెవైసి ఫ్రాడ్స్, ఇన్వెస్ట్ మెంట్స్ ఫ్రాడ్స్ , బ్యాంకు ఖాతాల ఓటిపిలు తెలియని వ్యక్తులకు షేర్ చేయవద్దని , తెలియని లింకుల పై క్లిక్ చేయరాదని తెలియజేస్తున్నారు. ఓటీపీ, సీవీవీ నెంబర్లు, పాస్వర్డ్ ఎవ్వరికి తెలియజేయరాదన్నారు. గుర్తు తెలియని వారికి వ్యక్తిగత సమాచారాన్ని అందించవద్దన్నారు. బ్యాంకుల నుంచి ఫోన్ చేస్తున్నామని చెప్పి సైబర్ నేరగాళ్ళు మోసపూరితంగా వ్యవహరిస్తున్నారని, అప్రమత్తంగా ఉండాలని తెలియజేస్తున్నారు.

# మహిళల భద్రతకు శక్తి యాప్ , వాట్సప్ సేవల పై అవగాహన

### మహిళల భద్రత కోసం ... శక్తి యాప్, శక్తి వాట్సాప్ నెంబర్ 7993485111





కర్నూలు, జూలై 2 (శ్రీచక్ర): మహిళల భద్రత కోసం ప్రభుత్వం ఏర్పాటు చేసిన శక్తి యాప్, శక్తి వాట్సాప్ నంబర్ల పై పాఠశాలలు, కళాశాలల్లో జిల్లా వ్యాప్తంగా అన్ని పోలీసు స్టేషన్ ల అధికారులు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని, విద్యార్థినిలకు , మహిళలకు వాటి సేవలను వివరిస్తున్నారని జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ బుధవారం తెలిపారు. జిల్లాలోని పలు పాఠశాలలు , కళాశాలల్లో, బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు, షాపింగ్ మాల్ లు, అంగన్వాడీ కేంద్రాలు ఇతర రద్దీ ప్రదేశాలలో, శక్తి యాప్ గురించి విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నారు. శక్తి యాప్ డౌన్లోడ్ చేసుకోవడం వల్ల విద్యార్థులకు రక్షణ , భద్రత ఉంటుందని ప్రతి ఒక్కరు శక్తి యాప్ ను ఫోన్లో నిక్షిప్తం చేసుకుని రిజిస్ట్రేషన్ చేసుకోవాలని శక్తి టీం బృందాలు తెలియజేశారు. అత్యవసర పరిస్థితుల్లో పోలీస్ స్టేషన్ కు వెళ్లాల్సిన అవసరం లేకుండా శక్తి యాప్ ద్వారా డయల్ 112 మరియు ఎూలా బటన్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చు అని తెలిపారు. మహిళలకు ఆపద సమయంలో అత్యవసర సాయం అందించేందుకు శక్తి యాప్ పని చేస్తుందని ప్రతి ఒక్క మహిళ, విద్యార్థులు మొబైల్ లో శక్తి యాప్ ను డౌన్లోడ్ చేసి, రిజిస్ట్రేషన్ చేసుకోవాలని తెలిపారు. "శక్తి" వాట్సప్ నెంబర్... 7993485111.మహిళలు అత్యవసర సమయాల్లో నేరుగా పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు పోలీసు సేవలను మహిళలకు మరింత చేరువ చేసేందుకు శక్తి యాప్ ను డౌన్ లోడ్ చేసుకోవడంతో పాటు "శక్తి" వాట్సప్ 7993485111 నెంబర్ ను మహిళలు, చిన్నారుల భద్రత కోసం సేవ్ చేసుకోవాలన్నారు. మహిళలు శక్తి వాట్సప్ నంబర్ కు కాల్ చేసినా, మెసేజ్ చేసినా సంబంధిత కమాండ్ కంట్రోల్ రూమ్ కు సంకేతాలు వెళ్లిన వెంటనే శక్తి టీమ్స్ సత్వరమే స్పందించి ఆపదలో ఉన్న మహిళలను ఆదుకుంటాయని చెప్పారు. 24/7 శక్తి వాట్సాప్ నంబర్ అందుబాటులో ఉంటుందని తెలిపారు. డయల్ - 112, 181, 1098, 1930 నెంబర్ల యెక్క ఉపయోగాలు, సోషల్ మీడియా ప్రభావం, చదువుకు ఉన్న ప్రాముఖ్యత, ఈవ్ టీజింగ్, ట్రాఫిక్ రూల్స్, బాల్యవివాహాలు, ప్రేమ పేరుతో జరుగుతున్న మోసాలు, వరకట్న వేధింపులు, సైబర్ నేరాలు, మహిళలు, చిన్న పిల్లలపై జరిగే నేరాల గురించి అవగాహన కల్పించారు.

# ఉద్యానవనాల అభివృద్ధికి చర్యలు

### బుధవారపేట పార్కు ప్రారంభోత్సవంలో టీజీ భరత్







కర్నూలు, జూలై 2 (శ్రీచక్ర): నగరంలోని ఉద్యానవనాల అభివృద్ధికి ప్రత్యేక దృష్టికి సారించి అవసరమైన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టీజీ భరత్ అధికారులను ఆదేశించారు. బుధవారం 16వ వార్డు బుధవారపేటలోని శ్రీ దామోదరం సంజీవయ్య మైదానంలో నడకబాట, ఓపెన్ జిమ్, కిడ్స్ ప్లే ఎక్యూప్మెంట్స్, పచ్చదనం, సుందరీకరణ పనులను మంత్రి టీజీ భరత్, ఎంపీ బస్తిపాటి నాగరాజు, నగరపాలక కమిషనర్ యస్.రవీంద్ర బాబు ప్రారంభించారు. ఈ మంత్రి మాట్లాడుతూ.. బుధవారపేట ప్రాంతంలో జనాభా ఎక్కువ ఉన్నప్పటికీ సేద తీరేందుకు ఒక్క అహ్లాదకరమైన ప్రదేశం లేదని, దీనిని దృష్టిలో ఉంచుకుని చేపల గుంత మైదానంలో రూ.31.4 లక్షలు వెచ్చించి అభివృద్ధి చేశామన్నారు. నగర పరిధిలో అన్ని పార్కుల అభివృద్ధి కృషి చేస్తామని, ప్రాధాన్యత క్రమంలో ప్రజా సమస్యలు పరిష్కరిస్తున్నట్లు మంత్రి పేర్కొన్నారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ యస్.శివమ్మ, డిప్యూటీ కమిషనర్ సతీష్ రెడ్డి, ఇంచార్జ్ ఎస్ఈ శేషసాయి, ప్రజారోగ్య అధికారి డాక్టర్ విశ్వేశ్వర్ రెడ్డి, డిఈఈ మనోహర్ రెడ్డి, ట్రైనీ ఏఈ రాంమోహన్, తదితరులు పాల్గొన్నారు.



# మా ప్రభుత్వ ఏడాది పాలనపై ప్రజలు పూర్తి సంతృప్తిగా ఉన్నారు

### ఇంటింటికీ తిరిగి ఏడాది పాలనలో చేసిన మంచిని వివరించిన మంత్రి టి.జి భరత్





కర్నూలు, జూలై 2 (శ్రీచక్ర): తమ ప్రభుత్వ ఏడాది పాలనపై ప్రజలు పూర్తిగా సంతృప్తి వ్యక్తం చేస్తున్నారని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టి.జి భరత్ అన్నారు. బుధవారం కర్నూలు నగరంలోని 15వ వార్డు బుధవారపేటలో ఆయన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా పర్యటించారు. వార్డులోని ప్రతి ఇంటికీ వెళ్లి ప్రజలతో మాట్లాడి ప్రభుత్వం చేస్తున్న సంక్షేమం, అభివృద్ధిని వివరించారు. సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదా అని తెలుసుకున్నారు. ఏ ఏ పథకాలు అందుతున్నాయో వివరాలు అడిగారు. ఏడాది కాలంలో మీకు ఎమైనా ఇబ్బందులు ఎదురయ్యాయా అని అడిగారు. అనంతరం మంత్రితో స్థానికులు మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న అన్ని పథకాలు తమకు అందుతున్నాయని బదులిచ్చారు. ఉచిత గ్యాస్ సిలిండర్లు, తల్లికివందనం పథకాలు తమకు వర్తించినట్లు చెప్పారు. ఎన్నో ఏళ్లుగా వార్డులో పేరుకుపోయిన సమస్యలు కూడా పరిష్కారమయ్యాయని గుర్తు చేశారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబుకు, మంత్రి టి.జి భరత్‌కు వారు ధన్యవాదాలు తెలిపారు. అనంతరం మంత్రి టి.జి భరత్ మాట్లాడుతూ ప్రభుత్వం చేస్తున్న మంచి పనులు వివరించి, ప్రజల సమస్యలు తెలుసుకునేందుకే సీఎం చంద్రబాబు నాయుడు ఈ కార్యక్రమం చేపట్టారన్నారు. వార్డు మొత్తం తిరిగిన తర్వాత చిన్న చిన్న సమస్యలు తమ దృష్టికి తెచ్చారని.. వీటిని త్వరలోనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. మాటిచ్చిన విధంగా అన్ని హామీలు నెరవేరుస్తున్నట్లు చెప్పారు. త్వరలో మరిన్ని పథకాలకు శ్రీకారం చుట్టనున్నట్లు తెలిపారు. దేశంలో ఎక్కడా లేని విధంగా పెన్షన్ ఇస్తున్నామని, తల్లికి వందనం, అన్నా క్యాంటిన్ల వల్ల ఎంతో మేలు జరుగుతుందన్నారు. సీఎం చంద్రబాబు బ్రాండ్‌తో రాష్ట్రానికి పరిశ్రమలు భారీగా వస్తున్నాయన్నారు. రాయలసీమను అభివృద్ధి చేసేందుకు ఈ ప్రాంతానికి పరిశ్రమలు తీసుకొస్తున్నట్లు చెప్పారు. అనంతపురం నుండి కర్నూలు వరకు ఇండస్ట్రియల్ కారిడార్ అభివృద్ధి చేస్తున్నట్లు చెప్పారు. ప్రభుత్వం చేస్తున్న మంచి పనులు చూసి ఓర్వలేక ప్రతిపక్ష పార్టీ నాయకులు ఇష్టానుసారంగా వ్యాఖ్యలు చేస్తున్నారని మంత్రి అన్నారు. గత ఎన్నికల్లో ప్రజలు ఇచ్చిన తీర్పుతో ఎలా వ్యవహరించాలో తెలుసుకోవాలని వారికి హితవు పలికారు. లేదంటే ఇప్పుడిచ్చిన తీర్పు కూడా రాబోయే రోజుల్లో దక్కదన్నారు.

## ఎస్. జె. డబ్ల్యూ. హెచ్. ఆర్. సి ఆధ్వర్యంలో అన్నధాన కార్యక్రమం: డా. వై. ఆర్. ఆర్. మోహన్ రావు



హైదరాబాద్, జూలై 2 (శ్రీచక్ర): సోషియల్ జస్టిస్ ఫర్ వరల్డ్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ నేషనల్ చీఫ్ సెక్రటరీ డా. వై. ఆర్. ఆర్. మోహన్ రావు ( రాజు ) పుట్టినరోజు సందర్భంగా హైదరాబాద్ లోని కస్తూరిబా ఆశ్రమంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మోహన్ రావు మాట్లాడుతూ తమ జాతీయ చైర్మన్ డా. కొప్పుల విజయ్ కుమార్ గారి ఆదేశాల మేరకు అనాధ పిల్లలకు అన్నధాన కార్యక్రమం నిర్వహించడం జరిగిందన్నారు. తాము ఎన్నో సామాజిక సేవా కార్యక్రమాలు చేస్తున్నామని అందులో భాగంగా నేడు ఈ అన్నధాన కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగిందని పేర్కొన్నారు. అంతేకాకుండా ఈనెలలో ఉచిత మెగా మెడికల్ క్యాంప్ నిర్వహించడం జరుగుతోందని ప్రకటించారు. అనంతరం మోహన్ రావును జాతీయ చైర్మన్ డా. కొప్పుల విజయ్ కుమార్ అభినందించారు. ఈ కార్యక్రమంలో డా. వై. ఆర్. ఆర్. మోహన్ రావు కుటుంబ సభ్యులు, ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

## ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షులు,రాజ్యసభ సభ్యులు లక్ష్మణ్ ని కలసిన చంద్రప్ప.




రేణిగుంట,జూలై 02(శ్రీచక్ర)భారతీయ జనతా పార్టీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షులు లక్ష్మణ్ తమ కుటుంబ సభ్యులతో కలిసి తిరుమల దర్శనార్ధం విచ్చేశారు.రేణిగుంట విమానాశ్రయం నందు బిజెపి ముఖ్య నాయకులతో కలిసి భారతీయు జనతా పార్టీ తిరుపతి జిల్లా మాజీ అధ్యక్షుడు డా.చంద్రప్ప,ఆయన కుమారుడు తరుణ్ శాలువతో సత్కరించి మర్యాదపూర్వకంగా కలిసి స్వాగతం పలికారు .

## శ్రీ కృత్తివెంటి పేర్రాజు పంతులు కళాశాలలో విద్యార్థులకు అవగాహన సదస్సు






రామచంద్రపురం, జూలై 2(శ్రీచక్ర) శ్రీ కృతివేంటి పెర్రాజు పంతులు ప్రభుత్వ డిగ్రీ కళాశాల నందు బుదవారం మహిళా విద్యార్థులకు సోషల్ మీడియా మోజులో పడి జీవితాలు ఏ విధంగా పాడు చేసుకుంటున్నారనే విషయం మీద అవగాహన సదస్సు నిర్వహించారు.ఈ సదస్సులో కళాశాల ప్రిన్సిపాల్ డా. విహెచ్ రామక్రిష్ణ మాట్లాడుతూ ఆడపిల్లల మీద చాలా దారుణాలు జరుగుతున్నాయని ప్రతీ ఆడపిల్ల బయట జరుగుతున విషయాల పట్ల అవగాహన కలిగి ఉండాలని,చదువు పట్ల శ్రద్ధ ,తల్లిదండ్రులు పట్ల గౌరవ భావన కలిగి ఉండాలని తెలియజేశారు.రామచంద్రపురం సిఐ ఎం వెంకటనారాయణ ముఖ్యంగా ఆడపిల్లకు చదువు చాలా అవసరం అని,చదువు ద్వారా విజ్ఞానం కలుగుతుందని, మహిళలకు ఉద్యోగ,ఉపాధి అవకాశాలు చాలా ఉన్నాయన్నారు. కావున వాటి మీద శ్రద్ధ తీసుకోవాలని,ఫోన్ సరిగ్గా ఉపయోగించకపోవడం వల్ల అనేక ఇబ్బందులుకు గురి అవుతుంటారు సోషల్ మీడియా వాడే విషయంలో చాలా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ప్రతీ రోజు పేపర్ చదవడం ద్వారా ప్రపంచ పరిజ్ఞానంతో పాటు, విజ్ఞానం పెరుగుతుందని తెలియజేశారు.ఎస్ఐ ఎస్ నాగేశ్వర రావు ,గృహ హింసా చట్టం, సైబర్ క్రైమ్ కోసం విద్యార్థులుకు అవగాహన కలిగించారు.ఈ కార్యక్రమంలో విద్యార్థులు, అధ్యాపకులు , అధ్యాపకేతర సిబ్బంది తదితరులు పాల్గొనారు.

# అర్హులైన వీధి విక్రయదారులు అందరికీ గుర్తింపు కార్డులు త్వరలోనే అందజేస్తాం.కమిషనర్ ఎన్.మౌర్య





తిరుపతి,జూలై02(శ్రీచక్ర):నగర పరిధిలో అర్హులైన వీధి విక్రయదారులు గుర్తించి అందరికీ నగరపాలక సంస్థ తరపున గుర్తింపు కార్డులు త్వరలో అందిస్తామని కమిషనర్ ఎన్.మౌర్య తెలిపారు.వీధి విక్రయదారులను గుర్తించడం, నిబంధనలపై వార్డ్ వెల్ఫేర్ సెక్రటరీలు, ఆర్.పిలకు బుధవారం కచ్చపి ఆడిటోరియం లో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలో వీధి విక్రయదారుల పై జరుగుతున్న సర్వే పారదర్శకంగా ఉండాలని అన్నారు.ఈ సర్వే రెండు మూడు రోజుల లోపల పూర్తి చేయాలని ఆదేశించారు. ఇంకా సర్వే లో నమోదు కాని వీధి విక్రయదారులను సంబంధిత వార్డ్ వెల్ఫేర్ సెక్రెటరీ,ఆర్.పిలతో నమోదు చేయించాలని అన్నారు. సర్వే పూర్తైన వెంటనే గుర్తించబడిన వీధి విక్రయదారులకు నగరపాలక సంస్థ ఆమోదంతో గుర్తింపు కార్డులను పంపిణి చేయడం జరుగుతుందని అన్నారు. ఎవరైనా ఇతరులు గుర్తింపు కార్డులు ఇస్తే అవి చెల్లవని తెలిపారు. గుర్తింపు కార్డుల కొరకు 200 రూపాయలు ఇండియన్ బ్యాంకు టౌన్ వెండింగ్ కమిటీ, తిరుపతి అకౌంట్ (ఎస్ బి అకౌంట్ నంబర్ – 8074122243) నకు జమ చేయాలని తెలిపారు. అనంతరం వెండింగ్ జోన్స్ ను ఏర్పాటు చేసి, కొన్ని గ్రీన్ జోన్స్ (ఫ్రీ వెండింగ్ జోన్స్), అంబర్ జోన్స్ (రిస్ట్రిక్టేడ్ వెండింగ్ జోన్స్) మరియు రెడ్ జోన్స్ (నో వెండింగ్ జోన్స్) ఏర్పాటు చేస్తామని అన్నారు. గ్రీన్ జోన్ నందు పూర్తిగా వ్యాపారం చేసుకోవడానికి అనుమతి ఇస్తారని, అంబర్ జోన్ నందు నిర్ణీత సమయము నందు మాత్రమే వ్యాపారం చేసుకోవచ్చునని,రెడ్ జోన్ నందు పూర్తిగా వ్యాపారము చేసుకోరాదని తెలిపారు.నగరపాలక సంస్థ గుర్తింపు కార్డు ఉన్న వారిని మాత్రమే వ్యాపారం చేసుకొనుటకు అనుమతిస్తారని తెలిపారు.గుర్తింపు పొందిన వీధి విక్రయదారుల నుండి ఎటువంటి రుసుము ఎవ్వరికీ చెల్లించనవసరము లేదని తెలిపారు.నగరపాలక సంస్థ కమిషనర్ మంజూరు చేసిన గుర్తింపు కార్డు మాత్రమే చెల్లుబాటు అవుతాయని,మరి ఏ ఇతర ప్రైవేటు వ్యక్తులు మంజూరు చేసిన ఐ.డి కార్డులు చెల్లవని కూడా తెలిపారు.ఈ కార్యక్రమములో డిప్యూటీ కమిషనర్ అమరయ్య,మెప్మా సి.యం.యంలు కృష్ణవేణి,సోమ కుమార్, సిఓలు,స్ట్రీట్ వెండార్స్ యూనియన్ నాయకులు శివ కుమార్,తదితరులు పాల్గొన్నారు.

## నర్సాపురం నియోజకవర్గంలో సీసీ కెమెరాల ఏర్పాటుకు ఆర్ధిక సహాయం అందించిన దాతలను సన్మానించిన జిల్లా ఎస్పీ అద్నాన్ నయీం అస్మి, నర్సాపురం నియోజకవర్గ ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్

**నేర నియంత్రణ మరియు శాంతి భద్రతల పరిరక్షణకు సీసీ కెమెరాలు అత్యంత కీలక సాధనాలన్న జిల్లా ఎస్పీ...**





నరసాపురం జులై 2 (శ్రీ చక్ర)నర్సాపురం నియోజకవర్గం ప్రజలకు మెరుగైన భద్రత కల్పించే దిశగా చేపట్టిన సీసీ కెమెరాల ఏర్పాటుకు ఉదారంగా ఆర్థిక సహాయం అందించిన దాతలను జిల్లా ఎస్పీ అద్నాన్ నయీం అస్మి, నర్సాపురం నియోజకవర్గ ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్ లు బుధవారం నర్సాపురం డీఎస్పీ కార్యాలయంలో జరిగిన ఒక ప్రత్యేక కార్యక్రమంలో ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ అద్నాన్ నయీం అస్మి మాట్లాడుతూ..సమాజంలో నేరాలను అరికట్టడానికి, శాంతిభద్రతలను కాపాడటానికి సీసీ కెమెరాలు అత్యంత కీలకమైన, ఆధునిక సాధనాలని పునరుద్ఘాటించారు. "ఒక నేరం జరిగినప్పుడు, నిందితులను త్వరగా గుర్తించడానికి, నేరానికి సంబంధించిన స్పష్టమైన ఆధారాలను సేకరించడానికి సీసీ కెమెరాలు ఎంతగానో ఉపకరిస్తాయని, అంతేకాకుండా, వాటి ఉనికి నేరస్తులలో ఒక రకమైన భయాన్ని కలిగించి, నేర నియంత్రణకు తోడ్పడుతుందని తెలియజేశారు. ఈ గొప్ప కార్యక్రమంలో పాలుపంచుకుని, తమ వంతు సహాయాన్ని అందించిన దాతలను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. నర్సాపురం నియోజకవర్గాన్ని నేర రహిత, సురక్షిత ప్రాంతంగా మార్చడమే లక్ష్యంగా పనిచేస్తున్న బొమ్మిడి నాయకర్ గారికి జిల్లా ఎస్పీ గారు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. దాతల భాగస్వామ్యంతో నర్సాపురం నియోజకవర్గంలోని ముఖ్య కూడళ్లలో, జనావాస ప్రాంతాలలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. భవిష్యత్తులో ఈ సీసీ కెమెరా నెట్వర్క్ను మరింత విస్తరించే ప్రణాళికలు ఉన్నాయని, తద్వారా నేరాలను నియంత్రించడమే కాకుండా, ఏదైనా అవాంఛనీయ సంఘటన జరిగినప్పుడు పోలీసులు త్వరితగతిన స్పందించడానికి దోహద పడుతుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ వి. భీమారావు నర్సాపురం డీఎస్పీ డాక్టర్ జి.శ్రీవేద నరసాపురం టౌన్ ఇన్స్పెక్టర్ బి. యాదగిరి , నరసాపురం రూరల్ ఇన్స్పెక్టర్ జి. దుర్గాప్రసాద్ మరియు ఇతర పోలీసు అధికారులు పాల్గొన్నారు.

## విద్యార్థులు సైబర్ క్రైమ్, మాదకద్రవ్యాల దుష్ప్రభావాలకు దూరంగా ఉండాలి

**విద్యార్థులు – విద్య పైనే దృష్టి సారించి ఉన్నత శిఖరాలకు ఎదగాలి జిల్లా ఎస్పీ అద్నాన్ నయీం అస్మి**

**నర్సాపురంలోని స్వర్ణాంధ్ర ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులకు జిల్లా ఎస్పీ అద్నాన్ నయీం అస్మి , ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం.**










నరసాపురం జులై 2( శ్రీచక్ర )మహిళా సంబంధిత నేరలు, సైబర్ క్రైమ్, మాదకద్రవ్యాల దుష్ప్రభావాలు వంటి మొదలగు అంశాలపై బుధవారం స్వర్ణాంధ్ర ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో జిల్లా ఎస్పీ అద్నాన్ నయీం అస్మి , ముఖ్య అతిథిగా పాల్గొని, ఉజ్వల భవిష్యత్తు కోసం ఆచరించాల్సిన పలు అంశాలపై విద్యార్థులకు దిశా నిర్దేశం చేశారు.మహిళా భద్రత – రక్షణకు దిశానిర్దేశంప్రతి మహిళా తనను తాను రక్షించుకోవడానికి అవసరమైన అవగాహన కలిగి ఉండాలని, అన్యాయం జరిగినప్పుడు భయపడకుండా ధైర్యంగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఇందుకోసం ప్రభుత్వం కల్పించిన సౌకర్యాలను వివరించారు: అత్యవసర సమయాల్లో కేవలం ఒక బటన్ నొక్కడం ద్వారా పోలీసులకు సమాచారం చేరేలా రూపొందించబడిన శక్తి యాప్ ప్రాముఖ్యతను వివరించారు. ప్రతి విద్యార్థిని తమ ఫోన్లలో ఈ యాప్ను ఇన్స్టాల్ చేసుకోవాలని సూచించారు. 112 (అత్యవసర సహాయం), 100 (పోలీస్), 181 (మహిళా హెల్ప్లైన్) వంటి హెల్ప్లైన్ నంబర్ల ప్రాముఖ్యతను తెలియజేశారు. ఈ నంబర్లను గుర్తుంచుకోవాలని, ఏదైనా సమస్య వచ్చినప్పుడు తక్షణమే సంప్రదించాలని కోరారు. ఏదైనా సమస్య వచ్చినప్పుడు సమీపంలోని పోలీస్ స్టేషన్ను ఆశ్రయించడానికి వెనుకాడవద్దని, అక్కడ మహిళా పోలీసులు అందుబాటులో ఉంటారని భరోసా ఇచ్చారు.సైబర్ నేరాలు – ఆన్లైన్ ప్రపంచంలో అప్రమత్తతడిజిటల్ యుగంలో సైబర్ నేరాలు ఒక పెద్ద సవాలుగా మారాయని ఎస్పీ అద్నాన్ నయీం అస్మి స్పష్టం చేశారు. ముఖ్యంగా యువత సోషల్ మీడియా, ఆన్లైన్ లావాదేవీలలో అధికంగా నిమగ్నమై ఉన్నందున, సైబర్ మోసాలకు గురయ్యే ప్రమాదం ఉందని హెచ్చరించారు. తెలియని వ్యక్తులకు, అపరిచిత వెబ్సైట్లలో వ్యక్తిగత వివరాలు, బ్యాంక్ ఖాతా వివరాలు, ఓటీపీ వంటి సున్నితమైన సమాచారాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ పంచుకోవద్దని సూచించారు. ఆకర్షణీయమైన ఆఫర్లు లేదా బెదిరింపులతో వచ్చే ఈమెయిల్లు, ఎస్ఎంఎస్ సందేశాలు, లింక్ల పట్ల అప్రమత్తంగా ఉండాలని, వాటిని క్లిక్ చేయవద్దని తెలిపారు. ఇవి మీ డివైజ్లలోకి మాల్వేర్ను ప్రవేశపెట్టి వ్యక్తిగత సమాచారాన్ని దొంగిలించే అవకాశం ఉందని హెచ్చరించారు. సోషల్ మీడియాలో స్నేహితుల పేరుతో డబ్బులు అడగడం, నకిలీ ప్రొఫైల్లతో వేధించడం వంటి సంఘటనలు జరుగుతాయని, వాటి పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మీ ప్రైవసీ సెట్టింగ్లను తరచుగా తనిఖీ చేసుకోమని సలహా ఇచ్చారు. ఏదైనా సైబర్ నేరానికి గురైనట్లయితే, తక్షణమే 1930 నంబర్కు డయల్ చేసి సైబర్ క్రైమ్ హెల్ప్లైన్ను సంప్రదించాలని, లేదా http://www.cybercrime.gov.in/ని వెబ్సైట్లో ఫిర్యాదు చేయాలని సూచించారు.మాదకద్రవ్యాల దుష్ప్రభావాలు – భవిష్యత్తుకు ముప్పుమాదకద్రవ్యాల వినియోగం యువత భవిష్యత్తును నాశనం చేస్తుందని ఎస్పీ అద్నాన్ నయీం అస్మి తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. డ్రగ్స్ కేవలం ఆరోగ్యాన్ని మాత్రమే కాదు, కుటుంబ సంబంధాలను, సామాజిక జీవితాన్ని కూడా నాశనం చేస్తాయని స్పష్టం చేశారు. డ్రగ్స్ వినియోగం వల్ల కాలేయం, కిడ్నీలు దెబ్బతినడం, మానసిక అనారోగ్యం, నిద్రలేమి, జ్ఞాపకశక్తి కోల్పోవడం వంటి తీవ్రమైన ఆరోగ్య సమస్యలు వస్తాయని వివరించారు. డ్రగ్స్ అలవాటు ఆర్థిక భారాన్ని పెంచుతుందని, నేరాలకు పాల్పడేలా ప్రోత్సహిస్తుందని, తద్వారా సమాజంలో గౌరవం కోల్పోతారని హెచ్చరించారు. ఎవరైనా డ్రగ్స్ వ్యసనానికి బానిసలైతే, దాని నుండి బయటపడటానికి కుటుంబం, స్నేహితులు మరియు నిపుణుల సహాయం తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వం కల్పించిన పునరావాస కేంద్రాల గురించి వివరించారు. కళాశాల యాజమాన్యం, అధ్యాపకులు, తల్లిదండ్రులు విద్యార్థుల పట్ల నిఘా ఉంచాలని, అనుమానాస్పద ప్రవర్తన కనిపిస్తే తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరారు. డ్రగ్స్ రహిత సమాజం కోసం అందరూ కలిసి పనిచేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ వి. భీమారావు నర్సాపురం డీఎస్పీ డాక్టర్ జి.శ్రీవేద నరసాపురం రూరల్ ఇన్స్పెక్టర్ జి. దుర్గాప్రసాద్ , ఇతర పోలీసు అధికారులు, కళాశాల అధ్యాపకులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

## సాంకేతికంగా అంతర్జాతీయ గుర్తింపునకు ఎన్ ఎ బి ఎల్ లేబరేటరీ పరీక్షలు దోహదపడతాయి!






భీమవరం జులై 2:( శ్రీ చక్ర )సాంకేతిక సామర్థ్యం ప్రయోగశాలకు అవసరమైన సాంకేతిక నైపుణ్యం గుర్తింపునకు ఎన్ ఎ బి ఎల్ (నేషనల్ అక్రిడేషన్ బోర్డ్ ఫర్ టెస్టింగ్ అండ్ కాలిబ్రేషన్ లేబరేటరీ) ద్వారానే సాధ్యమవుతుందని ఎన్ ఏ బి ఎల్ బెంగళూరు రీజనల్ , హెడ్ ఆఫ్ ఎన్ఎబి ఎల్, క్యూసిఐఆర్ డైరెక్టర్ ఆర్ శ్రీకాంత్ పేర్కొన్నారు. భీమవరం ఎస్ ఆర్ కె ఆర్ ఇంజనీరింగ్ కళాశాల సివిల్ ఇంజనీరింగ్ డిపార్ట్మెంట్ ఆధ్వర్యంలో గున్వత్త యాత్ర అవేర్నెస్ ప్రోగ్రాం ఆన్ ఎన్ ఏ బి ఎల్ అక్రిడేషన్ దాని వలన ఉపయోగాలు అనే అంశంపై ఒక రోజు వర్క్ షాప్ నిర్వహించారు. కార్యక్రమానికి సివిల్ ఇంజనీరింగ్ హెడ్ డాక్టర్ జి శ్రీ బాలా అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఎన్ఏబిఎల్ డైరెక్టర్ ఆర్ శ్రీకాంత్ మాట్లాడుతూ పరీక్ష ఫలితాలు నిర్ధారించేందుకు ఎన్ ఏబీఎల్ పరీక్షలు దోహదపడతాయని పేర్కొన్నారు. అంతర్జాతీయ స్థాయిలో కూడా ఎన్ ఎ బి ఎల్ అక్రిడేషన్ పొందిన లేబరేటరీస్ నుండి పొందిన పరీక్షా నివేదికలు ధ్రువపత్రాలు అంతర్జాతీయంగా ప్రత్యేక స్థానాన్ని గుర్తింపును పొందుతాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎం జగపతి రాజు, ప్రిన్సిపల్ డాక్టర్ కె.వి మురళీకృష్ణమరాజు మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వాటి నిర్మాణాలకు సంబంధించి భవిష్యత్తులో ఎన్ ఏ బి ఎల్ అక్రిడేషన్ ఉన్న లాబరేటరీ నుండి పరీక్షలు చేయించాలని నిబంధన వచ్చినప్పుడు ముందుగా వీటి అక్రిడేషన్ పొందితే ఎంతగానో ఉపయోగపడుతుంది అన్నారు. ఎన్ ఏ బి ఎల్ అసిస్టెంట్ డైరెక్టర్ పి శ్రీరామ్ మాట్లాడుతూ ప్రయోగశాలలకు అవసరమైన సాంకేతిక నైపుణ్యం గుర్తింపునకు ఎన్ ఎ బి ఎల్ అక్రిడేషన్ ఎంతగానో దోదపడుతుందన్నారు ఇటువంటి వర్క్ షాప్ లను కళాశాలలో సద్వినియోగం చేసుకుంటే కళాశాల కన్సల్టెన్సీ సర్వీసెస్ మరింత పెరుగుతాయని పేర్కొన్నారు. ఈ సందర్భంగా సివిల్ ఇంజనీరింగ్ హెడ్ డాక్టర్ జి శ్రీ బాల, డీన్ డాక్టర్ టి వంశీ నాగరాజు మాట్లాడుతూ ఎన్ ఎ బి ఎల్ తమ కళాశాలలో వర్క్ షాప్ నిర్వహించడం వలన ఈ ప్రాంత సాంకేతిక నిపుణులకు ఎంతగానో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు.

# చేదువాడలో బిజేపి శ్రేణులు ఇలాంటి ప్రచారం

## మండల అధ్యక్షులు శివాజీ ఆధ్వర్యంలో కరపత్రాలు పంపిణీ



కాజులూరు,జూలై 2 (శ్రీచక్ర)భారతీయ జనతా పార్టీ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా బిజెపి అద్యక్షులు అడబాల సత్యనారాయణ పిలుపు మేరకు కాజులూరు మండల శాఖ మిక్షిత్ భారత్ 2047 ప్రధానమంత్రి 11 సంవత్సరాల అమృతకాలం సేవా సూపర్ పాలన కార్యక్రమంలో భాగంగా కాజులూరు మండలం చేదువాడ గ్రామంలో దేశ ప్రధాని నరేంద్ర మోడీ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను వివరిస్తూ, ముద్రించిన కరపత్రాలు ఇంటింటా పంపిణీ చేశారు.ఈమేరకు బుధవారం మండల బిజెపి అధ్యక్షులు పుణ్యమంతుల శివాజీ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో 70 ఏళ్ళు పైబడి వృద్ధులకు అందజేసే ఆయుష్మాన్ భారత్ హెల్త్ కార్డును ప్రతి ఒక్కరు తీసుకోవాలని శివాజీ ప్రజలను కోరారు . ప్రధాన మంత్రి ఆవాస్ యోజన గ్రామీణ కింద అర్హులందరికీ ఇళ్ళను కేంద్ర మంజూరు చేస్తుందని అన్నారు .ఈ కార్యక్రమంలో జిల్లా పర్యావరణ పరిరక్షణ కార్యక్రమం కో కన్వీనర్ సలాది వీరబాబు, మండల ప్రధాన కార్యదర్శిలు నిమ్మన రాజేష్. వాసంశెట్టి రామకృష్ణ గ్రామ ప్రజలు మహిళామూర్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# నగరంలో 60కోట్లతో అభివృద్ధి పనులు చేస్తున్నాం:ఎమ్మెల్యే

## ఆరణిప్రజా సమస్యలను వెంటనే పరిష్కరిస్తున్నాం: కమిషనర్ మౌర్య



తిరుపతి, జూలై 02(శ్రీచక్ర)ఏడాది కాలంలో నగరంలో 60 కోట్ల రూపాయల నిధులతో అభివృద్ధి పనులు చేస్తున్నామని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు తెలిపారు. 33, 9 వ డివిజన్ ల పరిధిలోని అబ్బన్న కాలనీలో మారుతీనగర్ పరిధిలో 19.25 లక్షలతో నూతనంగా నిర్మించిన యూజిడి లైన్, సిసి డ్రైన్, సిసి రోడ్లను ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య డిప్యూటీ మేయర్ ముద్ర నారాయణ, కార్పోరేటర్లు దూది కుమారి, నరసింహాచ్చారి, నరేంద్ర, సికే రేవతి, శైలజ, వరికుంట్ల నారాయణలు బుధవారం ఉదయం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఏడాది కాలంగా నగరపాలక సంస్థలో పారదర్శకంగా పాలన అందిస్తున్నామని అన్నారు. గతంలో కార్పోరేషన్ పై 150కోట్ల అప్పుల భారం మోపగా, ప్రాధాన్యత క్రమంలో 75కోట్లు చెల్లించినట్లు ఆయన చెప్పారు. నగర అభివృద్ధికి ఎన్డీఏ కూటమి ప్రభుత్వం కట్టుబడి 60కోట్లతో వివిధ రకాల పనులు చేపట్టి కొన్ని పూర్తి చేసినట్లు ఆయన తెలిపారు. మిగిలిన పనులు కొనసాగుతున్నట్లు ఆయన చెప్పారు. రానున్న వర్షాకాలంను దృష్టిలో ఉంచుకుని డ్రైయిన్ లలో షిల్ట్ తీసి నీరు నిల్వకుండా చూస్తామని ఆయన తెలిపారు. కమిషనర్ ఎన్.మౌర్య మాట్లాడుతూ భూగర్భ డ్రైనేజీ సమస్యలు ఎక్కువుగా ప్రజల నుంచి వస్తున్నాయని చెప్పారు. నగరంలోని మురుగునీరు తూకివాకం వెళ్ళే అవుట్ పాల్ ఏరియా రేణిగుంట ప్రాంతంలో రోడ్డు మధ్యలో కుంగిపోయిందని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి ఈ సమస్యను పరిష్కరించాలని కోరామని అన్నారు. కేంద్ర ప్రభుత్వం ముందుకొచ్చి సుమారు 20 కోట్లతో డెమానుస్ట్రేషన్ ప్రాజెక్ట్ గా పరిష్కరించేందుకు ఆమోదం తెలిపింది అన్నారు. డ్రైనేజీ కాలువలు, డ్రైన్స్, సిసి రోడ్లు, వీధి లైట్ల సమస్యలు ఎదురైతే వెంటనే పరిష్కరించేందుకు కృషి చేస్తామని ఆమె చెప్పారు. ఈ కార్యక్రమంలో నగరపాలక సంస్థ అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

# జగన్ పాదయాత్ర 2.0



విజయవాడ, జూలై 2, ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికలు జరిగి ఏడాది పూర్తయింది. టీడీపీ-జనసేన-బీజేపీ ఘన విజయం సాధించి ప్రభుత్వం ఏర్పాటు చేసింది. చంద్రబాబునాయుడు సీఎం అయ్యారు. జనసే అధినేత పవన్ కళ్యాణ్ డిప్యూటీ సీఎం అయ్యారు. 2019 నుంచి 2024 వరకు అధికారంలో ఉన్న వైసీపీ ఈ ఎన్నికల్లో కేవలం 11 సీట్లకు పరిమితమైంది. ప్రతిపక్ష హోదా కూడా దక్కలేదు. ఈ క్రమంలో కూటమి సర్కార్ ఏడాది పాలన తర్వాత వైసీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి సంచలన నిర్ణయం తీసుకున్నారు. మరోసారి జనంలోకి వెళ్లేందుకు సిద్ధమవుతున్నారు. యువనేతల సమావేశంలో తన నిర్ణయం ప్రకటించారు.జగన్ 2017-19 మధ్య చేసిన 'ప్రజా సంకల్పయాత్ర' ఆయనకు రాజకీయంగా గణనీయమైన విజయాన్ని అందించింది. ప్రజల మధ్య ఉండడం, వారి సమస్యలను ఆలకించడం ద్వారా ఆయన వైసీపీని అధికారంలోకి తీసుకొచ్చారు. రాబోయే ఎన్నికల ముందు కూడా అదే ఆయుధం ఎక్కుపెట్టాలని జగన్ భావిస్తున్నారు. ఇది జగన్ 'మాస్ కనెక్ట్' వ్యూహాన్ని సూచిస్తుంది.

# కొప్పర్రు గ్రామం వద్ద కాలువలో లభ్యమైన గుర్తు తెలియని మృతదేహం

**కేసును ఛేదించిన నరసాపురం రూరల్ పోలీసులు..**
**సాంకేతిక ఆధారాల సేకరణ, విశ్లేషణ ద్వారా కొనసాగిన పోలీసుల సమగ్ర దర్యాప్తుతో పట్టుబడిన నిందితుడు........**
**పకడ్బందీ దర్యాప్తుతో అతి స్వల్ప కాలంలో హత్య కేసును ఛేదించిన నరసాపురం రూరల్, పోలీసు అధికారులు సిబ్బందిని ప్రత్యేకంగా అభినందించిన జిల్లా ఎస్పీ అద్నాన్ నయీం అస్మి ,**









నరసాపురం/ భీమవరం జూలై 2 శ్రీచక్ర పశ్చిమగోదావరి జిల్లా నరసాపురం రూరల్ మండలం కొప్పర్రు గ్రామం వద్ద కాలువలో 2025 జనవరిలో లభ్యమైన గుర్తు తెలియని మృతదేహం కేసును ఛేదించిన నరసాపురం రూరల్ పోలీసులను బుధవారం జిల్లా ఎస్పీఅద్నాన్ నయీం అస్మి ప్రత్యేకంగా అధికారులను అభినందించి రివార్డులు అందజేశారు. ఈ కేసు సంబంధించి విలేకరుల సమావేశంలో ఎస్పి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.కేసు వివరాలు:2025 జనవరి 27న ఉదయం 11 గంటలకు, కొప్పర్రు గ్రామంలోని డంపింగ్ యార్డుకు సమీపంలో ఉన్న నీటిపారుదల కాలువలో సుమారు 30 నుండి 40 సంవత్సరాల మధ్య వయస్సు గల ఒక గుర్తు తెలియని పురుషుడి మృతదేహం కుళ్లిపోయిన స్థితిలో లభ్యమైంది. మృతదేహం పొట్ట కుడివైపున గాయంతో ఉంది. కొప్పర్రు గ్రామానికి చెందిన వీఆర్వో ఇచ్చిన నివేదిక ఆధారంగా, నరసాపురం రూరల్ పోలీసులు క్రైమ్ నెంబర్ .42/25 అండర్ సెక్షన్ 103(1), 238 బి.ఎన్.ఎస్ యాక్ట్, 2023 కింద అదే రోజు మధ్యాహ్నం 12:15 గంటలకు కేసు నమోదు చేశారు.దర్యాప్తు ప్రక్రియ: ప్రాథమిక దర్యాప్తు:సంఘటన జరిగిన రోజునే మృతదేహానికి శవపంచనామా నిర్వహించి, నరసాపురం ప్రభుత్వ ఆసుపత్రి వైద్య అధికారికి అప్పగించారు. మృతదేహాన్ని గుర్తించేందుకు అవసరమైన విసెరా (లోపలి అవయవాలు), తొడ ఎముక, మరియు స్టెర్నమ్ భాగాలను భద్రపరచాలని కోరారు. ఫోరెన్సిక్ ఆధారాలు:విసెరాను విజయవాడలోని ఆర్ ఎఫ్ ఎస్ ఎల్ కు పంపగా, విశ్లేషణలో ఎటువంటి విషపూరిత పదార్థాలు లేవని తేలింది. స్టెర్నమ్‌లో డయాటమ్‌లు కూడా కనుగొనబడలేదు, ఇది మునిగిపోవడం వల్ల మరణం సంభవించలేదని స్పష్టం చేసింది. డిఎన్ఏ ప్రొఫైలింగ్ కోసం తొడ ఎముకను మంగళగిరిలోని ఎఫ్ ఎస్ ఎల్ కి పంపారు. శవపరీక్ష నివేదిక: 2025 జనవరి 27న నిర్వహించిన శవపరీక్ష నివేదిక ప్రకారం, మృతుడి మరణం శవపరీక్ష జరిగిన తేదీకి సుమారు 2 నుండి 3 వారాల ముందు జరిగిందని నిర్ధారించబడింది. మిస్సింగ్ కేసుల ధృవీకరణ: పశ్చిమ, తూర్పు మరియు కోనసీమ జిల్లాల నుండి అందిన డేటా ఆధారంగా, 15 పోలీస్ స్టేషన్ల పరిధిలోని మిస్సింగ్ కేసులను విశ్లేషించి, మూడు కేసులను షార్ట్‌లిస్ట్ చేశారు. వీటిలో పెరవలి పోలీస్ స్టేషన్ క్రైమ్ నెంబర్ .26/25 లోని తప్పిపోయిన వ్యక్తి వివరాలు అనుమానిత మృతుడి వివరాలతో సరిపోలాయి.మృతుడి గుర్తింపు:పెరవలి పోలీస్ స్టేషన్ క్రైమ్ నెంబర్ .26/25 ఆధారంగా, అనుమానిత మృతుడిని చుక్కల శ్రీనివాస్ (37), తండ్రి: పెద్ద రాజబాబు, పద్మశాలి కులం, నడిపల్లి గ్రామం, పెరవలి మండలం గా గుర్తించారు. ఇతను చివరిగా 2025 జనవరి 3న సజీవంగా కనిపించాడు. మృతుడి తల్లిదండ్రుల డిఎన్ఏ నమూనాలను సేకరించి, వాటిని మృతుడి తొడ ఎముక మరియు పుర్రె నుండి సేకరించిన డిఎన్ఏ నమూనాలతో సరిపోల్చగా, మృతుడు చుక్కల శ్రీనివాసే అని నిర్ధారించబడింది.నిందితుడి గుర్తింపు మరియు అరెస్ట్:పెరవలి పోలీస్ స్టేషన్ పరిధిలోని క్రైమ్ నెంబర్ .26/25 లోని కాల్ డేటా రికార్డులు (సీడీర్స్) మరియు టవర్ లొకేషన్ల సహాయంతో నిందితుడిని ట్రాక్ చేశారు. నిందితుడిని మల్లిపూడి శ్రీనివాస్ (35), తండ్రి: సత్యనారాయణ (లేట్), కాపు కులం, పూల వ్యాపారం, దుర్గమ్మ ఆలయం దగ్గర, కాకరపర్రు గ్రామం, పెరవలి మండలం గా గుర్తించి అరెస్ట్ చేశారు.నేరం వెనుక ఉద్దేశ్యం మరియు జరిగిన తీరు:నిందితుడు,మృతుడు మంచి స్నేహితులు. మృతుడు రాజమండ్రిలో డీఎస్సీ కోచింగ్‌కు వెళ్లవద్దని నిందితుడు చెప్పినా వినకపోవడంతో ఇద్దరి మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది.2025 జనవరి 3న రాత్రి, నిందితుడు, మృతుడు దువ్వ గ్రామం నుండి ద్విచక్ర వాహనం (సుజుకి యాక్సెస్) పై బయలుదేరారు. పెరవలికి వెళ్లే మార్గంలో, డీఎస్సీ కోచింగ్ విషయమై ఇద్దరి మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది. నిందితుడు మృతుడిని పెరవలి సమీపంలోని ప్లే బాయ్ ఫ్యాక్టరీ వద్ద నిర్మానుష్య ప్రాంతానికి తీసుకెళ్లి, రాత్రి 8:30 గంటల ప్రాంతంలో మళ్ళీ వాగ్వాదం ప్రారంభించాడు. ఆ సమయంలో, నిందితుడు ఆకస్మికంగా ఒక బీరు సీసా పెంకుతో మృతుడి కడుపు కుడివైపున పొడిచి హత్య చేశాడు.హత్య చేసిన తర్వాత, నిందితుడు మృతుడి కాళ్ళు మరియు చేతులను ఫోమ్ షీట్ తాడుతో కట్టి, దుస్తులను తీసివేసి, మృతదేహాన్ని పెరవలి కాలువలో (పెరవలి గ్రామానికి సుమారు 3 కిలోమీటర్ల దూరంలో) పడవేశాడు.తదుపరి దర్యాప్తు:నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపారు. కేసు బదిలీపై చట్టపరమైన అభిప్రాయం తీసుకోవడం జరుగుతుందని ఎస్పీ తెలిపారు.

# సుపరిపాలనలో తొలి అడుగు- ఇది ప్రజా విజయం

## ఇంటింట ప్రచార కార్యక్రమంలో రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి సుభాష్





రామచంద్రపురం, జూలై 2 (శ్రీచక్ర) సుపరిపాలనలో తొలి అడుగు విజయం రాష్ట్ర ప్రజలకు అంకితమని, వారి సంక్షేమమే ధ్యేయంగా భవిష్యత్తు పాలన ఉంటుందని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా జూలై 2వ తేదీ నుంచి ప్రారంభమైన "సుపరిపాలనలో తొలి అడుగు'' ఇంటింటి ప్రచార కార్యక్రమంలో భాగంగా రామచంద్రపురంలోని 1,2,3 వార్డులో ప్రచారం ప్రారంభించారు. ఇంటింటికి వెళ్లి ఏడాదిలో కూటమి పాలనలో జరిగిన అభివృద్ధి, సంక్షేమం ప్రజలకు వివరించారు. అలాగే ప్రజాభిప్రాయాలు సేకరించి మై టిడిపి యాప్ లో పొందుపరిచారు. ఈ సందర్భంగా మంత్రి సుభాష్ మాట్లాడుతూ గత ఏడాది కాలంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను విజయవంతంగా అమలు చేసిందని, కరపత్రాలు పంచుతూ వివరించారు. 2014-2019లో అభివృద్ధి, సంక్షేమం రెండూ చేసినా, ప్రజలకు సరిగా చెప్పలేకపోయిన కారణంగా 2019లో పార్టీకి నష్టం కలిగిందని గుర్తుచేశారు. ఈసారి అలాంటి పొరపాటు జరగకూడదని,చేసిన ప్రతి మంచి పనిని ప్రజల్లోకి తీసు కెళ్తున్నామన్నారు. వైసీపీ హయంలో రాష్ట్ర బ్రాండ్ ఇమేజ్ దెబ్బతిందని, కానీ ఇప్పుడు పారిశ్రామిక వేత్తలు తిరిగి విశ్వాసంతో నవ్యాంధ్రలో రూ. 9.34 లక్షల కోట్లతో పెట్టుబడులకు ఒప్పందాలు చేసుకున్నారని తెలిపారు. వీటి ద్వారా 8.5 లక్షల ఉద్యోగాలు సృష్టించే అవకాశం ఉందన్నారు. గూగుల్, టీసీఎస్, కాగ్నిజెంట్ వంటి అంతర్జాతీయ సంస్థలు రాష్ట్రంలో పెట్టుబడులకు ముందుకు రావడం కూటమి ప్రభుత్వ ఘనత అని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం దేశంలోనే అతిపెద్ద స్థాయిలో 64 లక్షల మందికి పింఛన్లు అందిస్తుండగా, ఇందుకు ఏడాదికి రూ.34 వేల కోట్లు ఖర్చవుతున్నట్లు చెప్పారు.సూపర్ 6 హామీలలో భాగంగాతల్లికి వందనం పథకం కింద 67.27 లక్షల విద్యార్థులకు నగదు జమ చేశామని, దీపం -2 కింద ఏడాదికి 3 ఉచిత గ్యాస్ సిలిండర్లు, ఉచిత బస్సు ప్రయాణం ఆగస్టు 15 నుంచి మహిళలకు అమలు, డీఎస్సీ ద్వారా 16,347 ఉపాధ్యాయ పోస్టుల భర్తీ, అన్నదాత సుఖీభవ, మత్స్యకార భరోసాకు రూ.250 కోట్లు, 204 అన్నా క్యాంటీన్లు ద్వారా రూ.5 కే నాణ్యమైన భోజనం,అర్చకులకు, నాయి బ్రాహ్మణులకు, పాస్టర్లకు, ఇమామ్ మౌజన్లకు గౌరవ వేతనాలు అందిస్తున్నట్లు మంత్రి వెల్లడించారు. అలాగే పోలవరం ప్రాజెక్టు, అమరావతి నిర్మాణం, ల్యాండ్ టైటిలింగ్ యాక్టర్ రద్దు, 77 ప్రాజెక్టుల పథకాల పునరుద్ధరణ , రూ. 9.34 లక్షల కోట్ల పెట్టుబడులకు ఒప్పందాలు వంటి అభివృద్ధి జరుగుతుందన్నారు. ప్రతిపక్ష హోదా లేని పార్టీలు రాష్ట్రంపై విష ప్రచారం చేస్తూ, కుల, మతాల పేరిట రెచ్చగొడుతున్నాయని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కూటమి ప్రభుత్వం మంచి ప్రభుత్వమని, జరుగుతున్న మంచిని ప్రజల్లోకి తీసుకెళ్లి వారి దీవెనలు తీసుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి పార్టీ నేతలు వాసంశెట్టి సత్యం, స్థానిక సంస్థల ఎన్నికల పరిశీలకులు కాకినాడ రామారావు, జెనసేన ఇన్చార్జి పోలిశెట్టి చంద్రశేఖర్, గరికపాటి సూర్యనారాయణ, నియోజకవర్గ, మండల కన్వీనర్లు, యూనిట్, బూత్ కన్వీనర్లు, అనుబంధ సంఘ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# బహుజన సమాజ్ పార్టీ కర్నూల్ జిల్లా అధ్యక్షునిగా గుదిపి సామేలు నియామకం



ఎమ్మిగనూరు,జూలై, 2( శ్రీ చక్ర ):- కర్నూలు జిల్లా మంత్రాలయం నియోజకవర్గం జాలవడి గ్రామ నివాసి అయిన గుదిపి సామేలును కర్నూలు జిల్లా అధ్యక్షునిగా నియమించడం జరిగిందని ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షులు బందెల గౌతమ్ ప్రకటించారు. మారుమూల గ్రామానికి చెందిన గుదిపి సామేలు బహుజన సమాజ పార్టీలో అంచలంచలుగా ఎదిగి మండల స్థాయి నుండి నియోజకవర్గం స్థాయి నుండి మళ్లీ జిల్లా స్థాయి వరకు బహుజన సమాజ పార్టీకి కర్నూలు జిల్లా అధ్యక్షునిగా ఎన్నికైనందుకు పార్టీ కార్యకర్తలు అందరూ ఎమ్మిగనూరు పట్టణంలోనీ ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ లో అభినందన సభను ఏర్పాటు చేశారు.ముఖ్య అతిథిలుగా బీఎస్పీ రాష్ట్ర కార్యదర్శి మరియు రాయలసీమ జోనల్ ఇంచార్జ్ మంచాల లక్ష్మీనారాయణ జిల్లా అధ్యక్షునికి నియామక పత్రాన్ని అందజేశారు.ఈ అభినందన సభకు ముఖ్య అధ్యక్షతగా ఆలురూ నియోజకవర్గ ఇన్చార్జి రామలింగయ్య బాధ్యత వహించారు. బి ఎస్ పి రాష్ట్ర కార్యదర్శి మంచాల లక్ష్మీనారాయణ మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం చేస్తున్న దౌర్జన్యాలను కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చలేక మోసపూరితమైన హామీలను ఇచ్చి రాష్ట్రంలో ప్రభుత్వాన్ని చేపట్టి ఇంతవరకు హామీలలో కనీసం సగం కూడా నెరవేర్చని దుస్థితిలో కూటమి ప్రభుత్వం ఉన్నది అని తెలిపారు. కూటమి ప్రభుత్వం ఇంతవరకు రైతులకు ఎటువంటి ఆర్థిక సహాయం అందించకపోగా,మహిళలపై జరుగుతున్నటువంటిదురాగతాలను అరికట్టలేకపోతున్నదని రాబోయే రోజులలో బహుజన సమాజ్ పార్టీని అధికారం దిశగా తీసుకెళ్లి బహుజనులకు జరుగుతున్న అన్యాయాలను జరగకుండా ఆపుతామని అలాగే ఎస్సీ, ఎస్టీ ,బిసి, మైనారిటీ లు అయినటువంటి బహుజనులు ఎవరి వాటా వారికీ జనాభా ప్రతీకార దిశగా స్థానిక సంస్థల ఎన్నికలలో అందరికీ సీట్లతో పాటు ఆర్థిక సమానత్వం బహుజన సమాజ్ పార్టీతోనే సాధ్యం అవుతుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో నూతన జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికైన గుదిపి సామేలుని నియోజకవర్గస్థాయి నాయకులందరూ ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమలో కర్నూలు జిల్లా ఇంచార్జి గాడి అరుణ్ కుమార్,ఆలూరు నియోజకవర్గం అధ్యక్షులు రామలింగయ్య, ఎమ్మిగనూరు నియోజకవర్గం అధ్యక్షులు ఆరేకంటి నాగరాజు, మంత్రాలయం నియోజకవర్గం అధ్యక్షులు మోహన్, ఆదోని నియోజకవర్గం అధ్యక్షులు ఫయాజ్ భాష , ఎమ్మిగనూరు అసెంబ్లీ ఇంచార్జి అంద్రి బంగారప్ప, బహుజన సమాజ్ పార్టీ మాజి జిల్లా సోషల్ మీడియా అధ్యక్షుడు హనుమన్న పార్టీ నాయకులు మరియు తదితర కార్యకర్తలు పాల్గొన్నారు.




# స్పోర్ట్స్ న్యూస్

# కౌంటీ క్రికెట్‌లో అదరగొడుతున్న ఇషాన్ కిషన్, తిలక్ వర్మ..!



భారత క్రికెటర్లు ఇషాన్ కిషన్, తిలక్ వర్మ ఇంగ్లీష్ కౌంటీ క్రికెట్‌లో అదరకొడుతున్నారు. ఇషాన్ నాటింగ్‌హామ్‌షైర్ తరఫున, తిలక్ హాంప్‌షైర్ తరఫున ఆడుతున్నారు. తిలక్ మూడు ఇన్నింగ్స్‌లో కలిపి 176 పరుగులు చేశాడు. ఇందులో సెంచరీ కూడా ఉన్నది. ఇషాన్ రెండు ఇన్నింగ్స్‌లో 164 పరుగులు చేశాడు. అయితే, పరిమిత ఓవర్ల క్రికెట్‌లో తిలక్ భారత జట్టు తరఫున ఆడుతున్నాడు. అయితే, 2022లో జట్టు నుంచి ఉద్వాసనకు గురైన ఇషాన్ కిషన్ తిరిగి జాతీయ జట్టులో చేరుకోలేకపోయాడు. కౌంటీల్లో రాణిస్తున్న నేపథ్యంలో టెస్టుల్లోకి మళ్లీ అరంగేట్రం చేసే అవకాశాలు కనిపిస్తున్నాయి. భారత జట్టు ప్రస్తుతం ఇంగ్లండ్ పర్యటనలోనే ఉన్నది. జట్టులో ఎవరైనా ఆటగాళ్లు గాయపడితే వారి స్థానం దక్కే అవకాశాలున్నాయి.తిలక్ హాంప్‌షైర్ తరఫున ఎసెక్స్‌తో తొలి మ్యాచ్ ఆడాడు. ఈ మ్యాచ్‌లో 11 ఫోర్లు, మూడు సిక్సర్ల సహాయంతో 241 బంతుల్లో 100 పరుగులు చేశాడు. హాంప్‌షైర్-ఎసెక్స్ మధ్య జరిగిన మ్యాచ్ డ్రాగా ముగిసింది. ఆ తర్వాత హాంప్‌షైర్ -వొర్సెస్టర్‌షైర్ మధ్య జరిగిన మ్యాచ్‌లో తిలక్ 171 బంతుల్లో ఏడు ఫోర్లు, ఒక సిక్సర్‌తో 56 పరుగులు చేశాడు. మొదటి ఇన్నింగ్స్‌లో ఏడు వికెట్లకు 679 పరుగులు చేసిన తర్వాత వొర్సెస్టర్‌షైర్ డిక్లేర్ చేసింది. అదే సమయంలో తిలక్ అర్ధ సెంచరీ చేసినప్పటికీ, హాంప్‌షైర్ జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో 221 పరుగులకు కుప్పకూలింది. ఆ ప్రస్తుతం ఆ జట్టు ఫాలో ఆన్ ఆడుతున్నది. ఫాలో-ఆన్‌లో మూడో రోజు ఆట ముగిసే సమయానికి, హాంప్‌షైర్ మూడు వికెట్లు కోల్పోయి 86 పరుగులు చేసింది. తిలక్ 20 పరుగులతో, కెప్టెన్ బెన్ బ్రౌన్ మూడు పరుగులతో క్రీజులో ఉన్నారు.ఇషాన్ కిషన్ నాటింగ్‌హైర్ తరఫున యార్క్‌షైర్‌తో తన తొలి మ్యాచ్ ఆడాడు. ఈ మ్యాచ్ డ్రాగా ముగిసింది. తొలుత బ్యాటింగ్ చేసిన నాటింగ్‌హ్యామ్‌షైర్ మొదటి ఇన్నింగ్స్‌లో 487 పరుగులు చేసింది. కిషన్ 98 బంతుల్లో 12 ఫోర్లు, ఒక సిక్సర్‌తో 87 పరుగులు చేశాడు. రెండవ ఇన్నింగ్స్‌లో ఇషాన్ కిషన్ బ్యాటింగ్‌కు రాలేదు. ఆ తర్వాత, నాటింగ్‌హామ్‌షైర్ జట్టు సోమర్‌సెట్‌తో మ్యాచ్ ఆడుతున్నది. సోమర్‌సెట్ మొదట బ్యాటింగ్ చేసి 379 పరుగులు చేసింది. బదులుగా నాటింగ్‌హామ్‌షైర్ జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో 509 పరుగులు చేసింది. కిషన్ 128 బంతుల్లో ఎనిమిది ఫోర్లు, రెండు సిక్సర్ల సహాయంతో 77 పరుగులు చేశాడు. ప్రస్తుతం, సోమర్‌సెట్ రెండో ఇన్నింగ్స్ కొనసాగుతున్నది.


# టీమిండియా బస చేస్తున్న హోటల్ వద్ద అనుమానాస్పద ప్యాకెట్.. గదులకే క్రికెటర్లు పరిమితం



బర్మింగ్‌హామ్: టీమిండియా క్రికెటర్లు బస చేస్తున్న హోటల్ సమీపంలో అనుమానాస్పద ప్యాకెట్ దొరకడంతో అక్కడ పోలీసులు కార్డన్ సెర్చ్ చేపట్టారు. ఆ సమయంలో క్రికెటర్లు ఎవరూ హోటల్ గదుల నుంచి బయటకు వెళ్లరాదు అని ఆదేశాలు ఇచ్చారు. దీంతో ప్లేయర్లు హోటల్‌కే పరిమితం అయ్యారు. బర్మింగ్‌హామ్‌లోని సెంటనరీ స్క్వేర్ వద్ద అనుమానాస్పద ప్యాకెట్‌ను గుర్తించారు. దీంతో అక్కడకు చేరుకున్న పోలీసులు సమీప బిల్డింగ్‌ల్లో ఉన్న నివాసితులను చెక్ చేశారు. టీమిండియా క్రికెటర్లు బస చేస్తున్న హోటల్‌ను కూడా సీజ్ చేశారు. బర్మింగ్‌హామ్ సిటీ సెంటర్ పోలీసులు ఇచ్చిన సోషల్ మీడియా పోస్టు ఆధారంగా క్రికెటర్లకు హెచ్చరిక జారీ చేసినట్లు బీసీసీఐ వర్గాలు తెలిపాయి.ఇవాల్టి నుంచి ఇంగ్లండ్‌తో రెండో టెస్టు ప్రారంభంకానున్నది. ఈ నేపథ్యంలో క్రికెటర్లు మంగళవారం ప్రాక్టీస్‌లో పాల్గొన్నారు. ఎడ్జ్‌బస్టన్‌లో గిల్‌తో పాటు కొందరు ఆటగాళ్లు ట్రైనింగ్‌లో పాల్గొన్నారు. మరో పది మంది సభ్యులు మాత్రం దూరంగా ఉన్నారు. సెంటనరీ స్క్వేర్ వద్ద కార్డెన్ సెర్చ్ జరుగుతోందని, అనుమానాస్పద ప్యాకేజీపై దర్యాప్తు చేపట్టినట్లు బర్మింగ్‌హామ్ పోలీసులు ఓ పోస్టు చేశారు. మధ్యాహ్నం మూడు గంటలకు తమకు అలర్ట్ ఇచ్చారని, దాంతో అక్కడ ఉన్న బిల్డింగ్‌లను ఖాళీ చేయించినట్లు ఓ మెసేజ్‌లో తెలిపారు. గంట పాటు జరిగిన కార్డన్ సెర్చ్ తర్వాత సీజ్ ఎత్తివేశారు.

# నా కెరీర్ త్వరగా ముగియడానికి వాళ్లే కారణం: శిఖర్ ధావన్

అభిమానులు ముద్దుగా 'గబ్బర్' అని పిలుచుకునే శిఖర్ ధావన్ అంతర్జాతీయ క్రికెట్ నుంచి త్వరగా రిటైర్ అయ్యారు. అయితే ఇంత త్వరగా వీడ్కోలు చెప్పాల్సి వస్తుందని ధావన్‌కు కూడా తెలియదు. కెరీర్ ప్రారంభంలో శిఖర్ ధావన్ ప్రదర్శన పెద్దగా ఆకట్టుకోలేదు. కానీ 2013లో శిఖర్ ధావన్ కెరీర్‌లో కొత్త మలుపు వచ్చింది. ప్రపంచం శిఖర్ ధావన్‌ను గుర్తించింది. తన టెస్ట్ అరంగేట్ర మ్యాచ్‌లోనే ఆస్ట్రేలియాపై అద్భుతమైన సెంచరీ చేసి.. తాను చాలా కాలం పాటు టీమిండియా కోసం ఓపెనింగ్ చేయబోతున్నానని నిరూపించాడు. శిఖర్ ధావన్ చాలా కాలం పాటు టీమిండియాకు ఓపెనింగ్ బ్యాటర్ గా వ్యవహరించాడు. కానీ త్వరలోనే శిఖర్ ధావన్ కెరీర్ ముగిసింది. అయితే భారత మాజీ క్రికెటర్ శిఖర్ ధావన్ తన ఆత్మకథ "ది వన్"ను ప్రకటించారు. తన ఆత్మకథ ప్రకటన సందర్భంగా ఓ ఆంగ్ల మీడియాతో శిఖర్ ధావన్ పలు ఆసక్తికర విషయాలను పంచుకున్నారు. తన కెరీర్ త్వరగా ముగియడానికి కారణమైన ఆ ఇద్దరు ఆటగాళ్లు ఎవరో శిఖర్ ధావన్ స్వయంగా ఇప్పుడు చెప్పుకొచ్చాడు.యువ ఆటగాడు ఇషాన్ కిషన్ డబుల్ సెంచరీ చేసినప్పుడు తన కెరీర్ ముగియబోతుందని అర్థమైందని శిఖర్ ధావన్ చెప్పుకొచ్చాడు. తనను జట్టు నుంచి తొలగించినప్పుడు ఎవరినీ సంప్రదించలేదని వెల్లడించాడు. జట్టు నుంచి తొలగించాక ఎవరికీ ఫోన్ చేయలేదని.. అయితే కొంతమంది సహచరులు మాట్లాడి మద్దతు ఇచ్చారన్నారు. అయినా దీని గురించి అస్సలు నిరాశపడలేదని.. దానిని ఆస్వాదిస్తున్నట్లు శిఖర్ ధావన్ చెప్పుకొచ్చాడు.శిఖర్ ధావన్ మాట్లాడుతూ.. ''శుభ్‌మన్ గిల్ ఆ





సమయంలో మూడు ఫార్మాట్లలో మంచి ప్రదర్శన చేస్తున్నాడు.అయితే నేను వన్డే జట్టులో మాత్రమే ఉన్నాను. అప్పుడు నా కెరీర్ ఎక్కువ కాలం కొనసాగదని నాకు అర్థమైంది." అని శిఖర్ ధావన్ చెప్పుకొచ్చాడు. వన్డే ఫార్మాట్ శిఖర్ ధావన్‌కు అత్యంత అద్భుతంగా ఉంది. 2013 ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీలో శిఖర్ ధావన్ ప్లేయర్ ఆఫ్ ది టోర్నమెంట్‌గా నిలిచాడు. ఆ తర్వాత శిఖర్ ధావన్ 2015 వన్డే ప్రపంచ కప్, 2017 ఛాంపియన్స్ ట్రోఫీలో అత్యధిక పరుగులు చేశాడు.శిఖర్ ధావన్ కెరీర్ చాలా అద్భుతంగా ఉంది. శిఖర్ ధావన్ టీమిండియా కోసం 34 టెస్టులు, 167 వన్డేలు, 68 టీ20 మ్యాచ్‌లు ఆడాడు. 34 టెస్ట్ మ్యాచ్‌ల 58 ఇన్నింగ్స్‌లలో బ్యాటింగ్ చేస్తూ ధావన్ 2315 పరుగులు చేశాడు. ఇందులో 7 సెంచరీలు, 5 అర్ధ సెంచరీలు ఉన్నాయి. వన్డేలలో ధావన్ 6793 పరుగులు చేశాడు. ఇందులో 17 సెంచరీలు, 39 అర్ధ సెంచరీలు ఉన్నాయి. టీ20లలో శిఖర్ ధావన్ 1759 పరుగులు చేశాడు. ఇందులో 11 అర్ధ సెంచరీలు ఉన్నాయి.

# బర్మింగ్‌హామ్ టెస్టులో తొలి వికెట్ కోల్పోయిన టీమిండియాకు.. రెండు పరుగులకు కేఎల్ రాహుల్ అవుట్..!



బర్మింగ్‌హామ్ ఎడ్జ్‌బాస్టన్ వేదికగా ఇంగ్లండ్‌తో జరుగుతున్న రెండో టెస్టులో టీమిండియా తొలి వికెట్ కోల్పోయింది. టీమిండియా 15 పరుగుల వద్ద కేఎల్ రాహుల్ అవుట్ అయ్యాడు. తొలి టెస్టులో అదరగొట్టిన కేఎల్ రాహుల్ కేవలం రెండు పరుగులకే పెవిలియన్ చేరాడు. ఇన్నింగ్స్ తొమ్మిదో ఓవర్‌లో వోక్స్ వేసిన బంతిని డిఫెండ్ చేసే ప్రయత్నంలో రాహుల్ క్లీన్ బౌల్డ్ అయ్యాడు. వోక్స్ వేసిన బంతి రాహుల్ బ్యాట్‌కు తగిలి వికెట్లను తాకింది. ప్రస్తుతం యశస్వి జైస్వాల్ 12 పరుగులతో క్రీజులో ఉన్నాడు.ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచిన ఇంగ్లండ్ మొదట ఫీల్డింగ్ ఎంచుకుంది. ఈ మ్యాచ్‌కు భారత జట్టులో మూడు మార్పులతో బరిలోకి దిగింది. మిస్టరీ బౌలర్ జస్ప్రీత్ బుమ్రా, శార్దూల్ ఠాకూర్, సాయి సుదర్శన్ తుది జట్టు నుంచి తప్పించింది. వారి స్థానంలో నితిశ్‌కుమార్‌రెడ్డి, వాషింగ్టన్ సుందర్, ఆకాశ్ దీప్‌లకు టీమ్ మేనేజ్‌మెంట్ చోటు కల్పించింది. ఇంగ్లండ్ జట్టు గత మ్యాచ్‌లో ఆడిన జట్టుతోనే బరిలోకి దిగింది. ప్రస్తుతం టీమిండియా 10.4 ఓవర్లకు గాను వికెట్ల నష్టానికి 21 పరుగులు చేసింది. ప్రస్తుతం కరుణ్ నాయర్ 5, జైశ్వాల్ 13 పరుగులతో క్రీజులో ఉన్నారు.

# బుమ్రా, సాయి, శార్దూల్ ఔట్.. ఇంగ్లండ్‌తో రెండో టెస్టు.. ఇండియా ఫస్ట్ బ్యాటింగ్




బర్మింగ్‌హామ్: ఇంగ్లండ్‌తో జరుగుతున్న రెండో టెస్టులో ఇండియా ఫస్ట్ బ్యాటింగ్ చేయనున్నది. టాస్ గెలిచిన ఇంగ్లండ్ జట్టు ముందుగా ఫీల్డింగ్ ఎంచుకున్నది. ఈ మ్యాచ్‌కు భారత జట్టులో మూడు మార్పులు చేశారు. స్పీడ్ బౌలర్ బుమ్రాను తప్పించారు. బుమ్రాతో పాటు శార్దూల్ ఠాకూర్, సాయి సుదర్శన్ కూడా రెండో టెస్టు నుంచి మిస్సయ్యారు. ఇంగ్లండ్ జట్టు మాత్రం మార్పులు ఏమీ చేయలేదు. తొలి టెస్టులో ఆడిన జట్టుతోనే ఇంగ్లండ్ బరిలోకి దిగుతున్నది. చివరి రోజు వరకు రసవత్తరంగా సాగిన తొలి టెస్టులో ఇంగ్లండ్ విజయం సాధించిన విషయం తెలిసిందే.ఒకవేళ టాస్ గెలిస్తే తాము కూడా ముందుగా బౌలింగ్ చేసేవాళ్లమని భారత కెప్టెన్ శుభమన్ గిల్ పేర్కొన్నాడు. భారత జట్టులోకి నితీశ్ కుమార్ రెడ్డి, వాషింగ్టన్ సుందర్, ఆకాశ్ దీప్‌లు వచ్చేశారు. బుమ్రా స్థానంలో ఆకాశ్‌ను తీసుకున్నారు. బుమ్రా వర్క్‌లోడ్‌ను తగ్గించాలన్న ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు గిల్ తెలిపాడు. కుల్దీప్ యాదవ్‌కు అవకాశం దక్కలేదు.

# ఆర్‌సీబీ వల్లే 11 మంది మృతి.. క్యాట్ సంచలన రిపోర్ట్!

రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు(ఆర్‌సీబీ) ఫ్రాంచైజీ కారణంగానే ఐపీఎల్ 2025 విజయోత్సవ వేడుకల్లో తొక్కిసలాట ఘటన చోటు చేసుకుందని సెంట్రల్ అడ్మినిస్ట్రేటివ్ ట్రిబ్యునల్(అయి) తెలిపింది. ఐపీఎల్ 2025 విజయానంతరం బెంగళూరు వేదికగా ఆర్‌సీబీ నిర్వహించిన విజయోత్సవ వేడుకలు విషాదంగా ముగిసిన విషయం తెలిసిందే. చిన్నస్వామి స్టేడియం బయట చోటు చేసుకున్న తొక్కిసలాటలో 11 మంది అభిమానులు మరణించగా.. మరో 50 మంది వరకు గాయపడ్డారు.ఈ ఘటనపై విచారణ చేపట్టిన అయి తమ రిపోర్ట్‌ను తాజాగా బయటపెట్టింది. ఈ రిపోర్ట్‌లో సంచలన వ్యాఖ్యలు చేసింది. తొక్కిసలాటకు ఆర్‌సీబీదే ప్రాథమిక బాధ్యత అని క్యాట్ స్పష్టం చేసింది. పోలీసులు, సంబంధిత అధికారుల నుంచి ఆర్‌సీబీ ఫ్రాంచైజీ అనుమతి తీసుకోకుండానే విజయోత్సవ వేడుకల్లో పాల్గొనాలని సోషల్ మీడియా వేదికగా అభిమానులకు పిలుపునిచ్చిందని ట్రిబ్యునల్ పేర్కొంది.ఆర్‌సీబీ ముందస్తు అనుమతి లేకుండానే విజయోత్సవ వేడుకలు నిర్వహిస్తున్నట్లు ప్రకటించడంతో 3 నుంచి 5 లక్షల మంది అభిమానులు వచ్చారని తెలిపింది. 35 వేల సీటింగ్ కెపాసిటీ కలిగిన స్టేడియానికి భారీ సంఖ్యలో హాజరయ్యారని పేర్కొంది. 12 గంటల వ్యవధిలో పోలీసులు ఇంత భారీ జన సమూహాన్ని నియంత్రించడానికి అవసరమైన ఏర్పాట్లు చేయలేరని అభిప్రాయపడింది. పోలీసులకు అతీత శక్తులు ఉండవని క్యాట్ తమ రిపోర్ట్‌లో పేర్కొంది.ఈ ఘటనకు బాధ్యుడిని చేస్తూ.. సస్పెండ్ చేసిన సీనియర్ ఐపీఎస్ అధికారి వికాస్ కుమార్ సస్పెన్షన్ క్యాట్ రద్దు చేసింది. అతని నిర్లక్ష్యం ఉందని చెప్పడానికి ఎలాంటి ఆధారాలు లేవని ట్రిబ్యూనల్ స్పష్టం చేసింది. ఇతర అధికారుల విషయంలోనూ ప్రభుత్వం ఇలానే చేయాలని సూచించింది. తాజా నివేదికతో ఆర్‌సీబీపై ఐపీఎల్ గవర్నింగ్ కౌన్సిల్ చర్యలు తీసుకుంటుందా? అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఆ జట్టుపై నిషేధం విధిస్తారా? అనే చర్చ కూడా





జరుగుతుంది.ఆర్‌సీబీ విజయోత్సవ వేడుకల్లో చోటు చేసుకున్న తొక్కిసలాట ఘటనపై భారత క్రికెట్ నియంత్రణ మండలి( బీసీసీఐ) కూడా ఆగ్రహం వ్యక్తం చేసింది. ఆర్‌సీబీ తొందరపాటు కారణంగానే ఈ ఘటన జరిగిందని అభిప్రాయపడింది. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు చోటు చేసుకోకుండా విజయోత్సవ వేడుకల విషయంలో కఠినమైన మార్గదర్శకాలను తీసుకొచ్చింది. విజయోత్సవ వేడుకలకు బీసీసీఐ అనుమతిని తప్పనిసరి చేసింది. టైటిల్ గెలిచిన వెంటనే విజయోత్సవ వేడుకలకు అనుమతి లేదని పేర్కొంది. అన్ని వేడులకు 4-5 అంచెల భద్రత ఉండాలని తెలిపింది.

# కమిలిన చర్మం కాంతివంతం





వేసవిలో ఎక్కువగా చర్మం కమిలిపోతుంటుంది. చాలామంది స్త్రీలు ముఖంపై చర్మం కమిలిపోయిందే అని బ్లీచింగ్ చేయించడం, లేదంటే వెంటనే ఇతర కాస్మోటిక్ ట్రీట్‌మెంట్స్‌ని వెతుక్కోవటం చేస్తుంటారు. వీటి వల్ల వెంటనే చర్మంలో మెరుగుదనం వచ్చినట్లు కనిపిస్తుంది. అయితే దీర్ఘకాలికంగా ఉండదు. అందుకే కాస్త సహనంతో ఎండ తాకిడికి గురైన చర్మాన్ని నేచురల్ హోమ్‌రెమెడీస్‌తో నయం చేయవచ్చు. చర్మకాంతికి అలొవెరా అలొవెరా చర్మకాంతికి అద్భుతంగా పనిచేస్తుంది. ముఖ్యంగా ఎండకు వాడిపోయిన చర్మానికి చక్కటి గ్లో తెస్తుంది. డైరెక్ట్‌గా అలొవెరా రసాన్ని మాయిశ్చరైజ్ చేస్తే ముఖంలో వెలుగు రావటంతో పాటు సున్నితత్వం వస్తుంది. అందానికి నిమ్మ ముఖ వర్చస్సు పెంచడంలో నిమ్మరసం అద్భుతంగా ఉపయోగపడుతుంది. ముఖంతో పాటు, సమస్య ఉన్న మిగిలిన ప్రాంతాల్లో నిమ్మకాయని సగానికి కట్ చేసి డైరెక్ట్‌గా చర్మంపై అప్లై చేసుకోవచ్చు. నిమ్మరసానికి కాస్త తేనె కలిపి పట్టించుకోవచ్చు. డ్రై అయిన తర్వాత నీళ్లతో కడిగేసుకోవాలి. ఇలా ప్రతిరోజూ చేస్తుంటే స్కిన్ మెరిసిపోతుంది. చర్మ సౌందర్యానికి టమాట విరివిగా కూరల్లో వాడుకునే టమోటా చక్కటి బ్యూటీ ప్రోడక్ట్. ఇందులో యాంటీ ఆక్సిడెంట్స్, మినరల్స్, విటమిన్స్ చర్మాన్ని ఆరోగ్యంగా ఉంచుతాయి. సన్‌టాన్‌ని తొలగించటంలో టమోటా ముఖ్యపాత్ర పోషిస్తుంది. టమోటాని బాగా గుజ్జు చేసి దానికి ఒక టేబుల్ స్పూన్ పెరుగు, ఓట్స్ పిండి కలిపి మిక్స్ చేయాలి. ఆ మిశ్రమాన్ని ముఖానికి అప్లై చేసి పది నిమిషాల తర్వాత నీళ్లతో వాష్ చేసుకోవాలి. ముఖంలో కాంతి వస్తుంది. దోసతో సొగసు శరీరానికి దోసకాయ చల్లదనాన్ని ఇస్తుంది. అందుకే దోసకాయ అంటే అందరికీ ఇష్టం. ఇక ఇందులో ఉండే విటమిన్‌'సి' చక్కటి మాయిశ్చరైజర్‌గా ఉపయోగపడుతుంది. దోస ఫేస్ ప్యాక్ చేయటం చాలా సులువు. ముందు దోసకాయని జ్యూస్‌లాగా చేసుకుని ఒక బౌల్‌లో తీసుకోవాలి. దీనికి తగినంత పరిమాణంలో నిమ్మరసం, రోజ్‌వాటర్ కలిపి మిక్స్ చేయాలి. ఈ ఫేస్‌ప్యాక్‌ని ముఖంతో పాటు కమలిన చేతులకి అప్లై చేసుకోవాలి. అరగంట ఆగాక కడిగేసుకోవాలి. ఇలా ఓ నాలుగుసార్లు దోసకాయ ఫేస్‌ప్యాక్‌ని వాడితే మునుపటిలా స్కిన్‌లో గ్లో వస్తుంది. అందం పెంచే ఆలూ సూర్యకిరణాలకు దెబ్బతిన్న చర్మాన్ని మెరుగుపర్చడానికి ఆలూ పర్ఫెక్ట్. ఇందులో ఉండే 'సి' విటమిన్ మంచి బ్లీచింగ్ ఏజెంట్‌లాగా ఉపయోగపడుతుంది. తొలుత ఆలుగడ్డపై ఉండే తోలు ఒలిచిన తర్వాత మెత్తగా చూర్ణం చేయాలి. దీనికి తగినంత నిమ్మరసం కలిపి కమిలిన ప్రాంతంలో అప్లై చేసి అరగంట తర్వాత చన్నీళ్లతో శుభ్రపరచుకోవాలి. చక్కటి ఫలితం ఉంటుంది.

# చెమట పొక్కులా?




వేసవిలో చెమట పొక్కుల బెడద ఎక్కువగా ఉంటుంది. దీంతో చిరాగ్గా అనిపిస్తుంటుంది. వాటి నుంచి బయటపడి చర్మాన్ని సంరక్షించుకోవాలంటే ఇలా చేసి చూడండి. టీట్రీ ఆయిల్‌లో యాంటీ బ్యాక్టీరియల్, యాంటీ వైరల్ గుణాలు అధికంగా ఉంటాయి. చెమట పొక్కులు విపరీతంగా వేధించినప్పుడు టీట్రీ ఆయిల్‌ని నీళ్లలో కలిపి అందులో దూదిని ముంచాలి. ఆ దూదిని కాసేపయ్యాక తీసుకుని చెమటపొక్కుల మీద తుడవాలి. చేతులతో నూనె రాయడం వల్ల ఇన్‌ఫెక్షన్ ఎక్కువ అవుతుంది. అలాకాకుండా దూదితో రాస్తే సమస్య త్వరగా తగ్గుతుంది. చెమట పొక్కులు వచ్చిన ప్రాంతంలో కలబంద గుజ్జును రాయాలి. దీనిలో యాస్ట్రింజెంట్ గుణాలు అధికం. చెమట పొక్కుల్నే కాదు.. కొన్నిరకాల ఇన్‌ఫెక్షన్లను ఆ గుణాలు దూరం చేస్తాయి. శరీరంలో వేడిని బయటకు పంపి చల్లదనాన్నిస్తుంది కలబంద. ఈ గుజ్జుకు పసుపు కలిపినా మరింత ప్రయోజనం ఉంటుంది. ఈ సమస్యకు కోల్డ్ కంప్రెసర్ చికిత్స బాగా ఉపయోగపడుతుంది. నీటిని ట్రేలో నింపి డీప్‌ఫ్రిజ్‌లో ఉంచాలి. తరవాత తయారైన ఐసుముక్కల్ని మెత్తని వస్త్రంలోకి తీసుకుని.. చెమట పొక్కుల మీద నెమ్మదిగా నొక్కినట్లు చేయాలి. మూడు నాలుగు గంటలకోసారి ఇలా చేయడం వల్ల పొక్కులు త్వరగా తగ్గిపోతాయి. వాటివల్ల వచ్చే నొప్పి, మంటా కూడా అదుపులో ఉంటాయి. కొన్నిసార్లు పొక్కుల వల్ల మంట కూడా ఉంటుంది. ఇలాంటప్పుడు వెనిగర్ చక్కటి పరిష్కారం అందిస్తుంది. వైట్ వెనిగర్‌లో టిష్యూ కాగితాన్ని ముంచి చెమట పొక్కుల మీద పరవాలి. కాగితం నుంచి వెనిగర్‌ను చర్మం గ్రహించాక తీసేయాలి. ఇలా చేయడం వల్ల ఆ సమస్యలు తగ్గడమే కాదు.. ఎంతో హాయిగానూ అనిపిస్తుంది. కొన్నిసార్లు చెమట పొక్కులు నొప్పిగా అనిపిస్తాయి. అలాంటప్పుడు లావెండర్ నూనెలో ముంచిన దూదితో ఆ ప్రాంతంలో మర్దన చేస్తున్నట్లు రాయాలి. కాసేపయ్యాక చల్లటి నీళ్లతో కడిగేస్తే ఉపశమనం కలుగుతుంది. నొప్పి ఉండదు. కొందరికి బ్లాక్ టీ తాగే అలవాటు ఉంటుంది. అలాంటి వారు ఈ టీని కాసేపు ఫ్రిజ్‌లో ఉంచి తీసి.. సమస్య ఉన్నచోట రాస్తే.. చెమట పొక్కుల బెడద తగ్గుతుంది. చర్మం మీద అందుకు సంబంధించిన ఇన్‌ఫెక్షన్లు ఉన్నా వెంటనే నశిస్తాయి.


# పాలు..బహు మేలు!



భూమ్మీద పుట్టిన దాదాపు ప్రతీ జీవరాశికి.. పాలే ప్రధాన.. ప్రథమ ఆహారం!మనిషి మాత్రమే.. అమ్మ పాలతో శరీర పటుత్వాన్ని సంపాదించి.. ఆ తర్వాత ఇతర జీవరాశుల పాల మీద ఆధారపడుతాడు..సంపూర్ణ పౌష్టికాహారంగా పేర్కొనే పాలను.. మనిషి విస్మరిస్తున్నాడని గణాంకాలు చెబుతున్నాయి.. అందుకే మళ్లీ పాల విశిష్ఠతను గుర్తు చేయడానికి.. ఎన్నో సంస్థలు పూనుకుంటున్నాయి.. జూన్ 1న ప్రపంచ పాల దినోత్సవంగా జరుపుతున్నాయి.. అందుకే ఏ పాలల్లో ఎంత ఆవశ్యకత ఉందో..ఏ పాలు మంచివో తెలిపే కథనం ఈ జంటకమ్మ. పాలు.. పాల ఉత్పత్తుల ద్వారా ఎంతో న్యూట్రీషనల్ వాల్యూస్‌ని మనం పొందుతున్నాం. అంతేకాదు.. పాల ఉత్పత్తి అనేది మిలియన్ డాలర్ల ఇండస్ట్రీగా కూడా చెప్పుకోవచ్చు. ఇంకా చెప్పాలంటే.. భారతదేశం పాల ఉత్పత్తిలో ప్రథమ స్థానంలో ఉంది. ఒక్కో రోజుకు ఒక్కో ప్రత్యేకత ఉండాలనుకుంటున్నారు జనాలు. కనీసం ఆ రోజునైనా ఆ రోజు విశిష్టత ఉందని వాటి మీద గౌరవం పెంచుకుంటున్నారు. అందుకే ఫుడ్ అండ్ అగ్రికల్చర్ ఆర్గనైజేషన్ 2001లో ప్రపంచ పాల దినోత్సవాన్ని ప్రారంభించింది. గ్లోబల్ ఫుడ్‌గా పాలను చెప్పొచ్చు.. కాబట్టే దానికంటూ ఓ ప్రత్యేకమైన రోజు ఉండాలని జూన్ 1న ఈ రోజును ప్రపంచ వ్యాప్తంగా జరిపేలా చూస్తున్నాయి చాలా సంస్థలు. 2016 నుంచి ఎక్కువ సంఖ్యలో సెలెబ్రేషన్స్ జరుగుతున్నాయి. ఆ సంవత్సరం 40 దేశాలు ఈ సెలబ్రేషన్స్‌ని జరిపితే, 2017లో 80 దేశాలు, 2018లో 72 దేశాలు పాల దినోత్సవాన్ని ఘనంగా జరిపాయి. ఆ సమయంలో ఎన్నో ఈవెంట్స్‌తో పాటు పాల వల్ల జరిగే మంచి, చెడుల గురించి చర్చించారు. ఇక సోషల్ మీడియాలో రేజ్ ఏ గ్లాస్ హ్యాష్ ట్యాగ్‌తో దీనికి సంబంధించిన క్యాంపెయిన్ కూడా చేస్తున్నారు. యవ్వనానికి వచ్చేసరికి ఎముకల దృఢత్వం వచ్చేస్తుంది. అప్పుడు పాల అవసరం లేదనుకుంటారు. కానీ క్యాల్షియం, విటమిన్ డీ, ఇతర మినరల్స్ అవసరం ఎంతైనా ఉంటుంది. ఇవి ఎముకల పటుత్వాన్ని పెంచుతాయి కాబట్టి పాలు తాగాలి. మీ ఎముకలలో, పళ్లలో 99శాతం శరీర కాల్షియం ఉంటుంది. ఈ కాల్షియం ఎముకలకు సాంద్రత, బలాన్ని ఇస్తుంది. సుమారు పావు లీటరు పాలల్లో 300మి.గ్రా. కాల్షియం దాగి ఉంటుంది. ఆడవాళ్లకు రోజుకు సుమారు వెయ్యి మి.గ్రా. కాల్షియం అవసరం. కాకపోతే వయసును బట్టి కూడా ఇది మారుతుంది. 19 నుంచి 50 సంవత్సరాలున్న వారికి 1200 మి.గ్రా అవసరమవుతుంది. అదే మగవాళ్లకు ఇదే వయసు ఉన్నవాళ్లకు వెయ్యి మి.గ్రా. కాల్షియం అవసరం. అంటే.. కనీసం అందరూ మూడు నుంచి నాలుగు గ్లాసుల పాలు తప్పనిసరిగా తీసుకోవాల్సి ఉంటుంది. ఆవు పాలు, గేదె పాలు చూడడానికి రెండూ ఒకేలా ఉంటాయి. కాకపోతే ఆవు పాలు చాలా లైట్‌గా ఉంటాయి. గేదె పాలు చాలా స్ట్రాంగ్‌గా ఉంటాయి. ఆవు పాలల్లో ఫ్యాట్ తక్కువ ఉంటే, గేదె పాలల్లో ఎక్కువ ఉంటుంది. ఆవు పాలు త్వరగా జీర్ణమవుతాయి. అందుకే వాటిని పిల్లలకు పట్టిస్తుంటారు. ఈ పాలల్లో 90 శాతం నీరే ఉంటుంది కాబట్టి దీంతో లభించే క్యాలరీలు కూడా తక్కువ ఉంటాయి. ఆవు పాలలో కాల్షియం, పాస్ఫరస్, మెగ్నీషియం, పొటాషియం వంటి పోషకాలూ తక్కువే. ఇక గేదె పాల విషయానికొస్తే.. దీంట్లో ప్రోటీన్లు ఎక్కువ. ఇతర మినరల్స్ కూడా అధికంగా ఉంటాయి కాబట్టి అధిక బరువు ఉన్న వారు గేదె పాల జోలికి వెళ్లొద్దు. వాళ్లు ఆవు పాలను తాగడం బెటర్. సన్నగా ఉన్నవారు గేదె పాలు తాగవచ్చు. వ్యాయామం చేసే వాళ్లు కూడా గేదె పాలు తాగడం మంచిది. చిన్న పిల్లలు పాలు తాగితే మంచిదంటారు. నిజంగా కూడా మంచిదే. మరి పెద్ద పిల్లలు, పెద్ద వాళ్లు, ఆడవాళ్లను కూడా గ్లాసులకు గ్లాసు పాలు తాగుమని సలహాలు ఇచ్చేస్తుంటారు. కానీ మగవాళ్లను పాలు తాగమని పెద్దగా అడగరు. ఎందుకంటే ఇప్పుడు చెప్పే విషయం ముందుగానే అందరికీ తెలిసిపోయినట్టుంది. మగవాళ్లు ఎక్కువగా పాలు తీసుకుంటే ప్రొస్టేట్ క్యాన్సర్‌తో బాధపడాల్సిందేనని హార్వర్డ్ స్కూల్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ వాళ్లు ప్రకటించేశారు. మామూలుగా కంటే కూడా 32 శాతం ఈ పాల వల్ల ప్రొస్టేట్ క్యాన్సర్ సంభవించే ప్రమాదం ఉందని చెబుతున్నారు డాక్టర్లు. ఒకవేళ అంతగా కాల్షియం అవసరం ఉంటే.. ఎంత మోతాదుకు మించకూడదో మీ ప్రత్యేక డాక్టర్ల సలహా తీసుకొని మరీ పాలు తాగాలంటున్నారు. కాబట్టి పాలు తాగే ముందు జర భద్రం. కొంతమందికి పాలు తాగితే ఎలర్జీ వస్తుంది. అలాంటి వాళ్లు కూడా పాలకు బదులు.. విటమిన్ డి లభించే ఇతర పదార్థాలను తీసుకోవడం మంచిది. గార్దభం పాలను చిన్నప్పుడు పోస్తుంటారు ఇప్పటికీ చాలా చోట్ల. దీనివల్ల ఎన్నో జబ్బులు నయమవుతాయని నమ్ముతారు. గాడిద పాల విశిష్టత గురించి మన కంటే చైనా వాడికి ఎక్కువ తెలుసు. గాడిదల కోసం పాకిస్తాన్ దగ్గర చేజాజిన రోజులు కూడా ఉన్నాయంటే అతిశయోక్తి కాదేమో! ఆస్తమా, దగ్గు, ఆయాసంలాంటి రోగాలకు ఈ పాలు మంచి ఔషధంలా పనిచేస్తాయి. తల్లిపాలు పడని పసికూనలకి కూడా ఈ పాలు బాగా పట్టించొచ్చని అంటుంటారు. సైంటిఫిక్‌గా కూడా ఈ పాలు ఎంతో మేలు అంటున్నారు. గాడిద పాలు చిక్కగా ఉన్నా.. ఇందులో 85శాతం నీళ్లు, ఐదున్నర శాతం కొవ్వులు ఉంటాయి. ఐరోపాల్లాంటి దేశాల్లో ఈ గాడిదను మన గంగిగోవులా పూజిస్తారు. మనదేశంలో గాడిద పాలకు గిరాకీ ఎక్కువ. అందుకే చిన్న జండూబామ్ సీసా పాలను 50 రూపాలయకు కొనుగోలు చేస్తున్నారంటే దీని డిమాండు అర్థం చేసుకోవచ్చు. మేక పాలల్లో ఎన్నో ఔషధ గుణాలున్నాయనేది మరచిపోవద్దు. ఈ రెండు పాల కన్నా మేక పాలు మరింత ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తాయని వైద్యులు కూడా నిర్ధారించారు. ఈ పాలు త్వరగా జీర్ణమవుతాయి. దీంట్లో కొవ్వు శాతం కూడా చాలా తక్కువ ఉంటుంది. ఆవు పాల కంటే కూడా ఇందులో కాసిన్ అనే మిల్క్ ప్రోటీన్ తక్కువ ఉంటుంది. అందువల్ల ఈ పాలతో ఎలర్జీలు వచ్చే ప్రమాదం అయితే ఉండదు.



# గాఢనిద్రకు ఘనాహారం




పిల్లలు అసలు నిద్రేపోవడం లేదనీ, తెల్లవార్లూ అదేపనిగా ఏడుస్తున్నారని చాలా మంది తలిదండ్రులు చెబుతుంటారు. అయినా, కారణం చెప్పి ఏడ్చే పెద్ద పిల్లలు వేరు. కానీ ఏ కారణం చెప్పకుండా ఎడతెరిపి లేకుండా ఏడ్చే పసిపిల్లలు నిజంగా చిరాకు పెట్టేస్తారు. కారణం తెలిస్తే ఏదో ఒకటి చేయవచ్చు, ఆ కారణమే తెలియకపోతే ఎవరైనా ఏం చేయగలరు? అయితే, బ్రిటన్ పరిశోధకులు ఈ సమస్యను అధిగమించడానికి అవసరమైన చిట్కా ఒకటి చెబుతున్నారు. పసిపిల్లల మీద జరిపిన ఒక అధ్యయనంలో ఏ పిల్లలకైతే, మూడు మాసాల వయసు నుంచే తల్లిపాలతో పాటు ఘనాహారం కూడా ఇస్తున్నారో, ఆ పిల్లలు హాయిగా నిద్రిస్తున్నారనీ. 6 మాసాల వయసు వచ్చేదాకా ఏ పిల్లలు కేవలం తల్లిపాల మీదే ఆధారపడుతున్నారో, వారు, తరుచూ మేలుకుంటూ ఏడుపు లంఘిస్తున్నారనీ వెల్లడయ్యింది. బ్రిటన్‌లో ప్రచురితమయ్యే .జర్నల్ 'జామా పీడియాట్రిక్స్' ఇటీవలి సంచికలో ఈ వివరాలు ప్రచురితమయ్యాయి. ప్రపంచ ఆరోగ్య సంస్థ కూడా పిల్లలకు 6 మాసాల దాకా తల్లిపాలు మాత్రమే ఇవ్వాలని సూచిస్తోంది, అయితే, చాలా మంది తల్లులు తమ పిల్లలకు 5 మాసాల కన్నా ముందే ఘనాహారం పెడుతున్నారు. ఇలా చేయడం వల్ల రాత్రివేళ తరుచూ మేల్కోవడం బాగా తగ్గి, హాయిగా నిద్రపోతున్నారని చెబుతున్నారు. ఇంతకీ ఘనాహారం ఇవ్వడం వల్ల కలిగే ప్రయోజనం ఏమిటీ అంటే, కేవలం తల్లిపాలకే పరిమితమైన పిల్లలకు వాళ్ల శరీరానికి అవసరమైన పోషకాలన్నీ వాటి ద్వారా లభించడం లేదనీ, ఆ కారణంగా వచ్చే అశక్తత, అసహనం వాళ్లు పూర్తి స్థాయి నిద్ర రాకపోవడానికి కారణమవుతున్నాయని వారు అందులో పేర్కొంటున్నారు. పైగా ఘనాహారం వల్ల కడుపు నిండుగా ఉండడం వల్ల వాళ్లకు కంటి నిండా నిద్ర పడుతోందని కూడా వాళ్లు చెబుతున్నారు. అందువల్ల తల్లిపాలతో పాటు పిల్లలకు కాసింత ఘనాహారం కూడా పెడితే సరి!

# ఆరెంజ్ పీల్ : ఆరోగ్య ప్రయోజనాలు



మనం నారింజ పండును తీసుకునేటప్పుడు, దాని తొక్కతో ఎటువంటి ఉపయోగం లేదని భావిస్తూ, తరచుగా పారవేస్తూ ఉంటాం. కానీ వాస్తవానికి నారింజ తొక్కలో ఉండే ప్రయోజనాలు అన్నీ ఇన్ని కాదు. నారింజ తొక్కలో అనేకరకాల వ్యాధుల ప్రమాదాన్ని తగ్గించగల ఆరోగ్య ప్రయోజనాలు అధికంగా కలిగి ఉన్నట్లుగా తెలుస్తుంది. ప్రధానంగా ఈ లక్షణాలు ఇన్ఫ్లమేషన్ (వాపు) ను తగ్గించడంలో ప్రభావవంతంగా ఉంటుందని చెప్పబడింది. క్రమంగా ఇన్ఫ్లమేషన్ సంబంధిత అనారోగ్య సమస్యలను తగ్గించడంలో కీలకపాత్ర పోషిస్తుంది. నారింజ తొక్క వంటి సిట్రస్ పండ్ల తొక్కలలో వివిధ రకాల ఫైటోకెమికల్స్ నిక్షేపాలు అధికంగా ఉంటాయి. ఇవి వ్యాధులను నిరోధించడంలో, డిఎన్ఎ డ్యామేజీని రిపేర్ చేయడంలో మాత్రమే కాకుండా శరీరం నుండి కార్సినోజెన్స్ తొలగించడంలో కూడా అత్యుత్తమ ప్రభావాలను కలిగి ఉంటాయని చెప్పబడింది. సిట్రస్ తొక్కలు యాంటీ క్యాన్సర్ గుణాలను కలిగి ఉంటాయని పరిశోధకులు కనుగొన్నారు. సిట్రస్ తొక్కలలో ఉండే పాలీమెథాక్సిఫ్లేవన్లు (ఖఓఈఐ), ఒక రకమైన ఫ్లేవొనోయిడ్ వలె పనిచేస్తాయి. ఇవి కాన్సర్ ఎదుగుదలను నిరోధించగలవు. మరియు క్యాన్సర్ కణాలతో పోరాడే లక్షణాలను కలిగి ఉంటాయి. ఇది కార్సినోజెనోసిస్ను ఇతర అవయవాలకు వ్యాప్తి చెందకుండా నిరోధిస్తుంది మరియు ప్రసరణ వ్యవస్థ ద్వారా కాన్సర్ కణాలు ప్రసరించకుండా అదుపు చేసి, వాటి సామర్థ్యాన్ని తగ్గిస్తుంది. క్రమంగా కాన్సర్ నివారణలో సహాయపడగలదని చెప్పబడుతుంది. నారింజ తొక్కలు ఎక్కువగా హెస్పెరిడన్ నిక్షేపాలను కలిగి ఉంటాయి. ఇది కొలెస్ట్రాల్ మరియు రక్తపోటు నిర్వహించడానికి సహాయపడే ఫ్లేవొయిడ్. అదేవిధంగా, నారింజ తొక్కలలో ఉండే పాలీమెథాక్సీఫ్లెవోన్స్ కూడా సమర్ధవంతంగా కొలెస్ట్రాల్ను తగ్గించగల సామర్థ్యాన్ని కలిగి ఉన్నట్లుగా చెప్పబడుతుంది. దీర్ఘకాలిక వాపు ( క్రానిక్ ఇన్ఫ్లమేషన్) అనేది గుండె జబ్బులు, క్యాన్సర్, మధుమేహం, అల్జీమర్స్ వ్యాధి వంటి రకరకాల వ్యాధులకు మూలకారణం. నారింజ తొక్కలలో ఉండే ఫ్లేవొనాయిడ్లు యాంటీ ఇన్ఫ్లమేటరీ లక్షణాలను కలిగి ఉంటాయని చెప్పబడింది, ఇవి వాపును, మంటను అదుపులో ఉంచడానికి సహాయపడుతుంది. అధికంగా ఆల్కహాల్ మరియు ధూమపానం సేవించడం అనేది, కాలక్రమేణా గ్యాస్ట్రిక్ అల్సర్స్ సమస్యకు దారితీస్తుంది. అయితే సిట్రస్ పండ్ల తొక్కల సారం, ఎలుకలలో గ్యాస్ట్రిక్ అల్సర్స్ ను సమర్థవంతంగా తగ్గించగలిగిందని ఒక అధ్యయనంలో తేలింది. టాంజరిన్ మరియు స్వీట్ ఆరెంజ్ తొక్కలలో కనిపించే హెస్పెరిడిన్, యాంటీ అల్సర్ లక్షణాలను కలిగి ఉంటుందని చెప్పబడుతుంది.





# మెగా 'విశ్వంభర' కోసం హాలీవుడ్..!



మెగాస్టార్ చిరంజీవి హీరోగా త్రిష హీరోయిన్‌గా వశిష్ట దర్శకత్వంలో రూపొందుతున్న 'విశ్వంభర' సినిమా వీఎఫ్ఎక్స్ ఆలస్యం కారణంగా వాయిదా పడుతూ వచ్చింది. అనౌన్స్‌మెంట్ టీజర్‌కి నెగటివ్ టాక్ రావడంతో పాటు, వీఎఫ్ఎక్స్ విషయంలో మెగా ఫ్యాన్స్ సైతం అసంతృప్తి వ్యక్తం చేశారు. దాంతో విశ్వంభర సినిమా వీఎఫ్ఎక్స్ విషయంలో మరింత జాగ్రత్త పడాల్సిన అవసరం ఉందని మేకర్స్ భావించినట్లుగా తెలుస్తోంది. అందుకే విశ్వంభర సినిమా వీఎఫ్ఎక్స్ వర్క్‌ను కాస్త ఎక్కువ బడ్జెట్ అయినా పర్వాలేదు కానీ అద్భుతంగా ఉండాలని ప్లాన్ చేశారు. అందుకే ఈ సినిమా కోసం హాలీవుడ్ సినిమాలకు వీఎఫ్ఎక్స్ వర్క్ చేసిన ప్రముఖ కంపెనీకి అప్పగించారని తెలుస్తోంది. సోషియో ఫాంటసీ మూవీ కనుక వీఎఫ్ఎక్స్ వర్క్ ఖచ్చితంగా ఎక్కువగా ఉంటుంది. ఇలాంటి సినిమాల్లో వీఎఫ్ఎక్స్ వర్క్ నాసిరకంగా ఉంటే కచ్చితంగా విడుదల సమయంలో విమర్శలు రావడం ఖాయం. అందుకే చిత్ర యూనిట్ సభ్యులు ఈ సినిమా వీఎఫ్ఎక్స్ విషయంలో అదనపు జాగ్రత్తలు తీసుకుని, సమయం ఎక్కువ తీసుకున్నా పర్వాలేదు అనుకుని హాలీవుడ్ సంస్థకు అప్పగించారని తెలుస్తోంది. అతి త్వరలోనే ఆ సంస్థ ఈ సినిమా వర్క్‌ను ముగించే అవకాశాలు ఉన్నాయి. చిత్ర యూనిట్ సభ్యుల నుంచి అందుతున్న సమాచారం ప్రకారం వీఎఫ్ఎక్స్ వర్క్ ఫైనల్ ఔట్ పుట్ వచ్చిన తర్వాత మాత్రమే సినిమా విడుదల తేదీ గురించి అధికారిక ప్రకటన చేయాలని భావిస్తున్నారు. మెగాస్టార్ చిరంజీవి ఈ సినిమాలో విభిన్నమైన పాత్రలో కనిపించబోతున్నాడు అంటున్నారు. బింబిసార వంటి విభిన్నమైన సోషియో ఫాంటసీ సినిమాను తెరకెక్కించిన దర్శకుడు వశిష్ట ఈ సినిమాకు దర్శకత్వం వహించడంతో అంచనాలు భారీగా ఉన్నాయి. పైగా చిరంజీవి సినిమా కావడంతో చాలా మంది ఈ సినిమా కోసం ఎదురు చూస్తున్నారు. గత ఏడాది నుంచి ఈ సినిమా కోసం అభిమానులు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. విశ్వంభర సినిమా కథ విషయంలో ఇప్పటి వరకు ఎలాంటి అప్డేట్ లేదు. కానీ గతంలో వచ్చిన జగదేక వీరుడు అతిలోక సుందరి సినిమా రేంజ్‌లో ఈ సినిమా ఉంటుంది అని మెగా ఫ్యాన్స్‌కి మేకర్స్ హామీ ఇస్తున్నారు. ఈ సినిమాలో త్రిష కాకుండా పలువురు హీరోయిన్స్ కనిపించబోతున్నారు. వారు చిరంజీవికి చెల్లెలు పాత్రల్లో కనిపించే అవకాశాలు ఉన్నాయి. ఈ సినిమాకు ఆస్కార్ అవార్డ్ గ్రహీత కీరవాణి సంగీతాన్ని అందిస్తున్నాడు. ఈ సినిమాలో ప్రత్యేకమైన ఐటెం సాంగ్ ఉంటుందని తెలుస్తోంది. ఆ ఐటెం సాంగ్‌లో బాలీవుడ్ నటి మౌని రాయ్ నటించే అవకాశాలు ఉన్నాయంటూ ఇటీవల వార్తలు వచ్చాయి. విశ్వంభర సినిమా విడుదల విషయంలో నెలకొన్ని సందిగ్ధంను చిరంజీవి బర్త్‌డే సందర్భంగా క్లారిటీ ఇచ్చే అవకాశాలు ఉన్నాయి. వచ్చే నెలలో విశ్వంభర సినిమా రిలీజ్ పై ఒక క్లారిటీ వచ్చే అవకాశాలు ఉన్నాయని, 2026 సంక్రాంతికి అనిల్ రావిపూడి దర్శకత్వంలో చిరంజీవి చేస్తున్న సినిమా రాబోతుందని మెగా కాంపౌండ్ నుంచి సమాచారం అందుతోంది.







# మెగాస్టార్ ఆఫర్ తిరస్కరించిన మధుబాల

రోజా చిత్రంతో సౌత్ లో అడుగుపెట్టింది మధుబాల. ఫూల్ ఔర్ కాంటే తర్వాత రోజా చిత్రంలో నటనకు గొప్ప పేరు తెచ్చుకుంది. దక్షిణాదిన మేటి కథానాయికగా నిరూపించిన మధూ హిందీ పరిశ్రమలోను తనదైన ముద్ర వేసింది. కానీ 1999లో సడెన్ గా ఆనంద్ షా అనే వ్యక్తిని వివాహం చేసుకుని సినిమాలకు దూరమైంది. అయితే అప్పట్లోనే బాలీవుడ్ మెగాస్టార్ అమితాబ్ బచ్చన్ సినిమాలో నటించే అవకాశం వరించినా, దానిని నిరభ్యంతరంగా తిరస్కరించానని మధుబాల ఓ ఇంటర్వ్యూలో వెల్లడించారు. అయితే ఈ ఆఫర్ ని తిరస్కరించడానికి కారణం పెళ్లి కుదరడమేనని తెలిపింది. అప్పటికే పెళ్లి తేదీ ఫిక్స్ చేసారు..పెద్ద ఆఫర్ కాదనుకున్నాను. ఆ అవకాశం సౌందర్యకు వెళ్లింది అని తెలిపింది. ఈ సినిమా – సూర్య వంశం. అమితాబ్ బచ్చన్, జయసుధ సహా ప్రముఖ ఆర్టిస్టులు నటించిన ఈ హిందీ చిత్రం పెద్ద ఫ్లాపైంది. కానీ ఆ తర్వాత కల్ట్ ఫాలోయింగ్ తో బుల్లితెరపై ఆదరణ దక్కించుకుంది. మధుబాల చాలా గ్యాప్ తీసుకున్న తర్వాత టాలీవుడ్ లో 'అంతకుముందు ఆ తరవాత' అనే చిత్రంతో రీఎంట్రీ ఇచ్చింది. ఇంద్రగంటి మోహన్ కృష్ణ ఈ చిత్రానికి దర్శకత్వం వహించారు. ఆ తర్వాత వరుసగా టాలీవుడ్ కోలీవుడ్ చిత్రాలతో బిజీ అయిన సంగతి తెలిసిందే. ఇటీవల మధుబాల తిరిగి సినిమాలతో బాగా బిజీ అవుతోంది. తాజా ఇంటర్వ్యూలో తాను బిజీ నాయికగా ఉన్న సమయంలో వరుసగా అవకాశాలొస్తున్నా, ఎందుకనో నటనపై విసుగు చెందానని మధుబాల చెప్పింది. కమర్షియల్ సినిమాల ఒరవడిలో వాస్తవిక దర్శకులతో పని చేయకపోవడం అసంతృప్తికి కారణమైందని చెప్పింది. బాలీవుడ్ లో ఏ లిస్టర్లతో అవకాశాల్ని కాదనుకుని సౌత్ లో వాస్తవికతను చూపే దర్శకులతో పని చేయడం ప్రారంభించానని మధుబాల పేర్కొంది. మధూ ఇటీవల 'కన్నప్ప'లో కనిపించింది. ముఖేష్ కుమార్ సింగ్ దర్శకత్వం వహించిన ఈ భక్తి చిత్రంలో విష్ణు మంచు ప్రధాన పాత్రలో మోహన్ బాబు, ఆర్. శరత్ కుమార్, అర్పిత్ రంకా, బ్రహ్మానందం తదితరులు నటించారు. మధు బాల తదుపరి 'చిన్న చిన్న ఆసై'లో కనిపించనున్నారు. ఈ రొమాంటిక్ డ్రామాను వర్ష వాసుదేవ్ రచించి దర్శకత్వం వహించారు



# తారక్ ట్విస్ట్ కు తెరపడేది అప్పుడే?

'వార్ 2' తో యంగ్ టైగర్ ఎన్టీఆర్ బాలీవుడ్ కి ఎంట్రీ ఇస్తోన్న సంగతి తెలిసిందే. ఇందులో తారక్ ప్రతి నాయకుడి పాత్ర పోషిస్తున్నాడని దాదాపు అంతా ఓ అంచనాకి వచ్చేసారు. రిలీజ్ అయిన ప్రచార చిత్రాలతో? తారక్ రోల్ పై ఈ క్లారిటీ వస్తోంది. ప్రతి నాయకుడు రోల్ అయినా హీరో హృతిక్ రోషన్ కి ధీటుగా ఆ రోల్ ఉంటుంది. అందులో ఎలాంటి సందేహం లేదు. ఆ నమ్మకంతోనే తారక్ విలన్ గా నటిస్తున్నా? అభిమానుల నుంచి ఎలాంటి ఒత్తిడి తెరపైకి రాలేదు. ఈ నేపథ్యంలో తాజాగా తారక్ రోల్ పై మరో కొత్త వార్త చక్కర్లు కొడుతుంది. ఇందులో హృతిక్ తరహాలోనే తారక్ కూడా ఓస్పై అంటున్నారు. భారత్ వైపు నుంచి దారి తప్పిన కబీర్( హృతిక్ రోషన్) ని ఎదుర్కొనే ధీటైన మరో ఏజెంట్ విక్రమ్ పాత్రలో తారక్ కనిపిస్తాడని ప్రచారం మొదలైంది. మరి ఇందులో నిజమెంతో తెలియాలి. ఇప్పటికే తారక్ వీరేంద్ర రఘునాథ్ గా కనిపిస్తాడని ప్రచారం లో ఉంది. తాజాగా విక్రమ్ అంటూ తెరపైకి రావడంతో తారక్ రోల్ పై మళ్లీ



సందేహాలు మొదలయ్యాయి. ఇంతకీ తారక్ నెగిటివ్ రోల్ పోషిస్తున్నాడా? హృతిక్ తరహాలో హీరోగా కనిపిస్తాడా? ఆయన్ ముఖర్జీ మరో విలన్ ని ప్లాన్ చేసాడా? అంటూ సందేహాలు వ్యక్తమవుతున్నాయి. సినిమా రిలీజ్ వరకూ ఇలాంటివన్నీ సహజం. వీటిపై మేకర్స్ కూడా క్లారిటీ ఇవ్వరు. అందులోనూ బాలీవుడ్ దర్శకులు అస్సలు రివీల్ చేయరు. కాబట్టి తారక్ ఎలాంటి పాత్ర పోషిస్తున్నాడో క్లారిటీ రావాలంటే ఆగస్టు 14 వరకూ ఎదురు చూడాల్సిందే. ప్రస్తుతం తారక్ –హృతిక్ పై ఓ సాంగ్ షూటింగ్ జరుగుతోన్న సంగతి తెలిసిందే. యశ్ రాజ్ స్టూడియోలో ఈ పాటను ఎంతో ప్రతిష్టాత్మకంగా తెరకెక్కిస్తున్నారు. సినిమా ఎలా ఉన్నా? ఈ పాట మాత్రం పీక్స్ లో ఉంటుం దనే అంచనాలు బలంగా ఉన్నాయి.




Printed and Published and Owned by **Dr. K. HARINATHA REDDY** on behalf of **Abhyudaya Publications, cell : 098483 34101, Printed at Abhyudaya Publications,** D. No. 203 IInd Floor, SOMA Arcade, Raj Theater Road, Kurnool - 518004, Kurnool Dist., Andhra Pradesh and Published From **Abhyudaya Publications,** D. No. 203 IInd Floor, SOMA Arcade, Raj Theater Road, Kurnool - 518004, Kurnool Dist., Andhra Pradesh, **Editor : Gudur Gopal**, **RNI No. APTEL/2012/46940**, e-mail: **sreechakratelugu@gmail.com.**